

అనుదినం... జనస్వరం

కరీంనగర్ - రాజన్న సిరిసిల్ల
పెద్దపల్లి - జగిత్యాల

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

08 పేజీలు | గురువారం 26 అక్టోబర్ 2023 | www.navatelangana.com



పోలీసు అమరుల త్యాగాలు మరవొద్దు

రాజన్న సిరిసిల్ల డీఎస్పీ ఉదయ్‌రెడ్డి

సిరిసిల్ల టౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట అమరవీరులకు నివాళులు

2లో...

సెకండ్ లిస్టుపై ఉత్కంఠ



- నేడు, రేపో మలివిడత అభ్యర్థులను ప్రకటించనున్న 'హస్తం' హైకమాండ్
- ఆరుస్థానాల్లోని ఆశావహుల్లో వీడని ఆందోళన..
- టిక్కెట్ తనకే దక్కుతుందన్న దీమాతో జనంలో తిరుగుతున్న వైనం
- ప్రచారంలో దూకుడు పెంచిన తొలి విడతలో ఖరారైన ఏడుగురు అభ్యర్థులు
- అందరి చూపు కరీంనగర్, హుస్నాబాద్ స్థానాలపైనే...

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

కాంగ్రెస్ సెకండ్ లిస్టుపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. నేడో, రేపో మలివిడత జాబితాను 'హస్తం' హైకమాండ్ విడుదల చేయబోతోందన్న వార్తలతో ఉమ్మడి జిల్లాలో మిగిలిన పోయిన ఆరు స్థానాల్లో ఆశావహులు ఆందోళనలోపడ్డారు. టిక్కెట్ కోసం ఎవరిస్థాయిలో వాళ్లు విశ్వప్రయత్నాలే చేస్తున్నారు. అదే సమయంలో జనంలోనూ తిరుగుతున్నారు. మరోవైపు తొలివిడుతలో ఖరారైన అభ్యర్థులు మాత్రం ప్రచారంలో దూకుడు పెంచారు. అధికారపార్టీ అభ్యర్థులకు అక్కడక్కడా ముచ్చెమటలు పట్టిస్తున్నారు. బీఆర్ఎస్, బీజేపీలోని అసంతృప్తులను చేరదీస్తూ కాంగ్రెస్‌లో చేర్చుకుంటుండగా.. ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా కరీంనగర్, హుస్నాబాద్‌లో తేలే అభ్యర్థులపైనే చర్చ సాగుతుండటం గమనార్హం.

అధికార బీఆర్ఎస్ పార్టీ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 13 అసెంబ్లీ నియోజకవర్గాలకూ అభ్యర్థులను ముందుగానే ప్రకటించింది. కాంగ్రెస్ ఇటీవలే 7 స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించింది. అందులోని వారంతా సీనియర్లు కావడం, గత ఎన్నికల్లో గట్టిపోటీనిచ్చిన వారే అవడంతో అక్కడ గెలుపుపై 'హస్తం' అధిష్టానం నమ్మకం పెట్టుకుని ధీమాలో ఉంది. ఇక మిగిలిపోయిన కరీంనగర్, చొప్పదండి, సిరిసిల్ల, కోరుట్ల, హుజూరాబాద్, హుస్నాబాద్ స్థానాల్లో అభ్యర్థులు ఎవరో తేలకపోగా.. అక్కడ ఆశావహుల పోటీ కూడా ఉండటం గమనార్హం.

టిక్కెట్ కోసం విశ్వప్రయత్నాలు

- కాంగ్రెస్‌లో సీనియర్ నేత, తెలంగాణ ఉద్యమ నాయకునిగా పేరున్న పొన్నం ప్రభాకర్ గౌడ్‌కు తొలివిడతలోనే పేరు ఖరారు కాకపోవడం విస్మయానికి గురి చేసింది. అయితే ఆయన తన కరీంనగర్ స్థానాన్ని వదిలి హుస్నాబాద్‌కు పయనం కావడమే కారణంగా తెలుస్తోంది. తన ఓటు హక్కును కూడా హుస్నాబాద్‌కు బదలాయించుకున్న ఆయన అక్కడ సింహభాగంగాఉన్న బీసీల ఓటర్లపైనే ఆశలు పెట్టుకున్నారు. అయితే ఆయనకు పోటీగా గతంలోనే అక్కడ కాంగ్రెస్ ఎమ్మెల్యేగా పని చేసిన అలిగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి సైతం టిక్కెట్ కోసం గట్టి ప్రయత్నమే చేస్తుండటం గమనార్హం.
- మరోవైపు ఆశావహుల పోటీ లేకపోయినప్పటికీ చొప్పదండిలో మేడిపల్లి సత్యంకు తొలిజాబితాలో చోటుదక్కపోవడం పట్ల అక్కడి

మిగతా 2లో...





రెన్నెళ్లలోనే 'తారు'మారు

- కుంగిపోయి, బీటలు వారిన కేబుల్‌బ్రిడ్జిపై రోడ్డు
- సామాజిక మాధ్యమాల్లో ఫొటోలు, వీడియోలు వైరల్
- కమీషన్ల కోసం కాంట్రాక్టర్లతో కుమ్మక్కయ్యారంటూ విపక్షాల మండిపాటు
- సమగ్ర విచారణ చేపట్టాలి: సీపీఐ(ఎం) డిమాండ్

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయప్రతినిధి

ఓవైపు మేడిగడ్డ బ్యారేజ్ కుంగిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగామారగా.. కరీంనగర్‌జిల్లాలోని ప్రతిష్టాత్మక కేబుల్‌బ్రిడ్జిపై రోడ్డు పగళ్లు ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారాయి. తీగల వంతెనపై బీటలుబారి, తారులేచి ప్రమాదకరంగా మారి రోడ్డు ఫొటోలు, వీడియోలు సామాజికమాధ్యమాల్లో వైరల్‌కాగా.. ఆ ప్రాంతాన్ని విపక్ష పార్టీల నాయకులు సందర్శిస్తూ విమర్శలు గుప్పిస్తున్నారు. కమీషన్ల కోసం కాంట్రాక్టర్లతో కుమ్మక్కయ్యారంటూ మండిపడుతున్నారు. కేబుల్‌బ్రిడ్జిపై రోడ్డు పనుల నాణ్యతపై సమగ్ర విచారణ చేపట్టాలని సీపీఐ(ఎం) నాయకులు డిమాండ్ చేశారు. ఏదేమైనా ఎన్నికల వేళ ప్రతిష్టాత్మక నిర్మాణాల్లో వెలుగుజూస్తున్న నిర్మాణలోపాలు సోషల్‌మీడియాలో చక్కర్లుకొడుతుండటం హాట్‌టాపిక్‌గా మారాయి.

టూరిజం హబ్‌గా కరీంనగర్ జిల్లా కేంద్రంలో కేబుల్‌బ్రిడ్జి నిర్మాణం, మానేరు రివర్‌ఫ్రంట్‌ప్రాజెక్టు ప్రతిష్టాత్మకంగా నిలిచాయి. ఇప్పటికే నిర్మాణం పూర్తి చేసుకుని రాకపోకలు సాగుతున్న కేబుల్‌బ్రిడ్జి అందాలు నగరవాసులనేకాకుండా నలుమూలల నుంచి వచ్చే వారి చూపులను ఆకట్టుకుంటోంది. రాత్రివేళల్లో డైనమిక్‌లైట్ల వెలుగుల మధ్య ఆకర్షణగా నిలుస్తున్న కేబుల్‌బ్రిడ్జిపై కుంగిన రోడ్డు ఫొటోలు, వీడియోలు ఇప్పుడు సోషల్‌మీడియా వేదికగా చక్కర్లుకొడుతున్నాయి. రూ.181కోట్ల వ్యయ అంచనాతో 2017లో కేబుల్ బ్రిడ్జి నిర్మాణాన్ని ప్రారంభించి ఇటీవలే దాన్ని పూర్తి చేశారు. రాష్ట్రంలోనే దుర్గం చెరువు తరువాత హైలెట్‌గా డైనమిక్‌లైట్ల మధ్య కరీంనగర్ కేబుల్‌బ్రిడ్జి నిలిచిపోయిందనే చెప్పవచ్చు. జూన్‌లోనే రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖమంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభమైన కేబుల్‌బ్రిడ్జి వద్ద వీకెండ్‌షోలు, కాకర్స్‌షోలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అబ్బురపరిచింది. అయితే సరిగ్గా రెన్నెళ్ల క్రితం కేబుల్‌బ్రిడ్జిని కలుపుతూ అప్రోచ్‌రోడ్డు సైడ్‌వాల్ కుంగిపోయింది. అయితే అది సహజంగానే కుంగిపోతుందని, పలుమరమ్మతులతో మళ్లీ యథాస్థితికి వస్తుందని సంబంధిత రోడ్డు,భవనాల శాఖ అధికారులు వివరణ ఇచ్చారు. కుంగిన సైడ్‌వాల్‌కు మరమ్మతు చేశారు. తాజాగా రోడ్డుపై తారు అంతా పగుళ్లు చూపింది. బ్రిడ్జి పొడవునా రోడ్డు బీటలు వారింది. దీనిపై సదరు శాఖ అధికారులు ఇంతవరకూ స్పందించకపోగా ఇప్పుడు ఆ ఫొటోలు, వీడియోలు సోషల్‌మీడియా వేదికగా వైరల్ అయ్యాయి.

సమగ్ర విచారణ చేపట్టాలి: సీపీఐ(ఎం) డిమాండ్



కరీంనగర్ స్మార్ట్ సిటీలో భాగంగా నిర్మించిన తీగల వంతెన కాంట్రాక్టర్ల వైఫల్యం, ప్రజాప్రతినిధులు, అధికారుల చేతివాటాన్ని బట్టబయలు చేస్తోందని సీపీఐ(ఎం) నగర కార్యదర్శి గుడికందుల సత్యం విమర్శించారు. బ్రిడ్జిపై రోడ్డు పలుమార్లు కుంగిపోవడం, బీటలు వారడం చూస్తుంటే నాణ్యతాప్రమాణాలు ఏమేరకు పాటించారో అర్థం అవుతోందన్నారు. బుధవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తీగల వంతెన పనుల పైన సమగ్ర విచారణ చేపట్టాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



నామినేషన్ ప్రక్రియపై పూర్తి అవగాహన ఉండాలి

- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి
- రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులకు శిక్షణ

5లో...

ఆ ఇద్దరి చేరికతో దాసరికి లాభం లేదు.. నష్టం లేదు

- బీఆర్ఎస్‌లో చేరిన పెద్దపల్లి మాజీ ఎంపీపీలు సత్యనారాయణ రెడ్డి, వేముల రామ్మూర్తి
- కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన ఘంటా రాములు ఎటువైపు?

7లో...

ధరణితోనే సమస్యలు

- కాంగ్రెస్ జగిత్యాల అభ్యర్థి జీవన్‌రెడ్డి

6లో...



ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించడమే పోలీసుల లక్ష్యం
సిరిసిల్ల డిఎస్పీ ఉదయ్ రెడ్డి


పోలీసు బలగాలు ఫ్లాగ్ మార్చ్

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట

ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించడమే పోలీసుల లక్ష్యమని సిరిసిల్ల డీఎస్పీ ఉదయ్‌రెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బుధవారం బీఎస్ఎఫ్, జిల్లా పోలీసు సిబ్బందితో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికలను నిర్వహించడానికి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్టు డీఎస్పీ తెలిపారు. రానున్న ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలందరికి పోలీసులు ఎల్లవేళలా తోడుంటారని ధైర్యాన్ని కల్పించడానికి ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో, గొల్లపల్లి, బొప్పాపూర్ మొదలగు ప్రాంతాల్లో బిఎస్ఎఫ్ బలగాలు, జిల్లా పోలీసు సిబ్బందితో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఫ్లాగ్ మార్చ్‌లో ఎల్లారెడ్డిపేట సి.ఐ శశిధర్‌రెడ్డి, ఎస్ఐ రమాకాంత్, పోలీస్ సిబ్బంది, బిఎస్ఎఫ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేకే మహేందర్‌రెడ్డి ఇంటింటికి ప్రచారం



నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట

మండలంలోని రాజన్నపేట గ్రామంలో సిరిసిల్ల నియోజకవర్గం ఇంచార్జీ కేకే మహేందర్ రెడ్డి బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ రాజన్నపేట గ్రామాన్ని మంత్రి కేటీఆర్ దత్తత తీసుకొని ఏం అభివృద్ధి చేశాడని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు షేక్ గౌస్, జిల్లా కార్యదర్శి లింగంగౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్త కష్టపడాలి : బోయిన్‌పల్లి వినోద్‌కుమార్



నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట

డిసెంబర్ 3న గులాబీ జెండాను రెపరెపలాడించేందుకు ప్రతి బిఆర్ఎస్ కార్యకర్త కష్టపడాలని తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయిన్‌పల్లి వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బుధవారం పార్టీ కార్యాలయాన్ని నాస్కాబ్ చైర్మెన్ కొండూరి రవీందర్‌రావు, పార్టీ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, ఎంపీపీ పిల్లిరేణుక కిషన్, జెడ్పీటీసీల చీటి లక్ష్మణ్‌రావు, మండల అధ్యక్షుడు,సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరిలతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టైక్స్‌టైల్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ గూడూరి ప్రవీణ్, రాష్ట్ర నాయకులు చీటి నర్సింగరావు పాల్గొన్నారు.

కొనరావుపేటలో సాయుధ బలగాల కవాతు



నవతెలంగాణ - కొనరావుపేట

కొనరావుపేట మండలం నిమ్మపెల్లి కొనరావుపేట గ్రామంలో డీఎస్పీ నాగేంద్రచారి ఆధ్వర్యంలో బీఎస్ఎఫ్ జవాన్లతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ వేములవాడ అసెంబ్లీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని, ఎటువంటి శాంతి భద్రతల సమస్యలు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పాత నేరస్తులను ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా బైండోవర్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ కిరణ్ కుమార్ ఎస్సై ఆంజనేయులు సిబ్బంది పాల్గొన్నారు.

అవినీతి ప్రభుత్వాని గద్దె దించుదాం..



నవతెలంగాణ - కొనరావుపేట : అవినీతి ప్రభుత్వాన్ని గద్ద దించుదామని కాంగ్రెస్‌తోనే బంగారు తెలంగాణ సాధ్యమని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేములవాడ నియోజకవర్గ అభ్యర్థి ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలలోని నిజామాబాద్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు జెగన్ మోహన్ రెడ్డి, సర్పంచ్ కేతిరెడ్డి అరుణ, మండల అధ్యక్షులు ఫిరోజ్ పాషా, నాయకులు ఉన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై సమగ్ర విచారణ జరపాలి

నవతెలంగాణ - ఇల్లంతకుంట : లక్షల కోట్లు వెచ్చించి నాణ్యత లోపంతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్ పై సమగ్ర విచారణ జరపాలనీ కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశం రాజేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. బుదవారం ఆయన మాట్లాడుతూ కోట్ల రూపాయల ప్రజధనాన్ని నీటి పాలు చేశారని విమర్శించారు. నాణ్యత లోపంతో ఆదరా బాదరాగ అనతి కాలంలో నిర్మించడం వల్ల మేడిగడ్డ వద్ద నిర్మించిన పిల్లర్లు కుంగడం వెనుక ప్రభుత్వ నిర్లక్ష్యం బయట పడిందన్నారు. ఇంజనీర్లను పక్కకు పెట్టి తానే ఒక ఇంజనీర్ లాగా వ్యవహరించి ప్రజా ధనాన్ని వధా చేయడమే కాకుండా, కోట్ల రూపాయలు కమీషన్ లకు పాల్పడిన కేసీఆర్ ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని ఓటర్లను కోరారు.

సెకండ్ లిస్టుపై ఉత్కంఠ

▸ మొదటి తరువాయి

శ్రేణులను ఆందోళనకు గురి చేసింది. అయినప్పటికీ అక్కడ సత్యం తప్ప మరో నేత ప్రత్యామ్నాయంగా లేరనే చెప్పవచ్చు. మలివిడత జాబితాలో సత్యం పేరు ఖరారవడం ఖాయమనే చెప్పవచ్చు.

- సిరిసిల్లలో పోటీకి సిద్ధమైన కేకే మహేందర్‌రెడ్డి టిక్కెట్ తనకే ఇస్తారన్న ధీమాలో ఉన్నారు. అయినప్పటికీ అక్కడ బీజేపీ నుంచి అనూహ్యంగా రాణిరుద్రమారెడ్డిని తీసుకురావడంతో ఆ పార్టీలో టిక్కెట్ ఆశించిన వారిలో కొందరు కాంగ్రెస్‌వైపు చూస్తున్నారు. అందులోనూ పద్మశాలీ సంఘం రాష్ట్ర నాయకునిగా ఉన్న లగిశెట్టి శ్రీనివాస్ కాంగ్రెస్‌లోకి వెళ్లేందుకు సుముఖంగా ఉన్నట్టు రాజకీయవర్గాల్లో చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలో శ్రీనివాస్ హస్తం గూటికి వస్తే టిక్కెట్ ఇద్దరిలో ఎవరికి ఇస్తారో వేచిచూడాల్సిందే!
- అత్యధికంగా టిక్కెట్ కోసం 15 దరఖాస్తులు వచ్చిన కరీంనగర్ సెగ్మెంట్ అందరి దృష్టిని ఆకర్షించింది. అయితే ఇక్కడ కొత్త జయపాల్‌రెడ్డి, పురుమళ్ల శ్రీనివాస్, కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, రోహిత్‌రావు పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నా... బీఆర్ఎస్, బీజేపీలు బీసీ నేతలనే రంగంలోకి దింపిన క్రమంలో టిక్కెట్ పురుమళ్లకు వస్తుందన్న చర్చ సాగుతోంది.అయినప్పటికీ ఈ నలుగురు ఆశావహులు తమతమ లాబీయింగ్‌లో ప్రయత్నాలు చేస్తున్నారు.
- హుజూరాబాద్ అసెంబ్లీ స్థానం నుంచి మొన్నటి ఉప ఎన్నికలో పోటీ చేసిన బల్మూరి వెంకట్‌కే టిక్కెట్ వస్తుందని అందరూ భావించగా తొలి విడతలో పేరు ప్రకటించలేదు. ఆ తరువాత సుదీర్ఘరాజకీయాల్లో సీనియర్ నేతగా పేరున్న దివంగత వొడితెల రాజేశ్వర్‌రావు మనువడు బల్మూరి ప్రణవ్‌బాబు ఇటీవల బీఆర్ఎస్‌ను వీడి 'హస్తం' గూటికి చేరారు. దీంతో టిక్కెట్ ప్రణవ్‌బాబుకే వస్తుందన్న చర్చ సాగుతోంది.
- కోరుట్ల నుంచి జువ్వాడి నర్సింగరావుతోపాటు మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి రామ్‌లు కుమారుడు కొమిరెడ్డి కరమ్ టికెట్ కోసం పోటీ పడుతున్నారు.

బీఆర్ఎస్‌తోనే సింగరేణి మనుగడ సాధ్యం
రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్



నవతెలంగాణ-గోదావరిఖని:

బీఆర్ఎస్‌తోనే సింగరేణి మనుగడ సాధ్యమని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. సింగరేణి సంస్థ ఆర్జీ-1 పరిధి 1ఇంక్లైన్ పై బుధవారం జరిగిన గేట్ మీటింగ్‌కు ఆయన హాజరై మాట్లాడారు. సింగరేణి కార్మికులను కంటికి రెప్పలాగా కాపాడుతుంది సీఎం కేసీఆర్ అని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో పోగొట్టిన వారసత్వ ఉద్యోగాలను, కారుణ్య నియామకాల పేరుతో పునరుద్ధరించి, బొగ్గు బ్లాక్‌ల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఉంటేనే సింగరేణి గనులకు, కార్మికులకు మనుగడని, బీఆర్ఎస్ పార్టీని మరోమారు గెలిపించి, కేసీఆర్‌ని ముఖ్యమంత్రిని చేయాల్సిన బాధ్యత ప్రతి కార్మికునిపైనా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ నాయకులు కెంగర్ల మల్లయ్య, జహీద్ పాషా, కనకం శాంసన్, నారాయణదాసు మారుతి తదితరులున్నారు.

పెద్దపల్లి గడ్డపై బీఎస్పీ జెండా ఎగురవేస్తాం : దాసరి ఉష



నవతెలంగాణ- పెద్దపల్లి టౌన్

పెద్దపల్లి నియోజకవర్గంలో బీఎస్పీకి ప్రజలలో ఆదరణ పెరుగుతుందని,పెద్దపల్లి గడ్డపై బీఎస్పీ జెండా ఎగురవేస్తామని బీఎస్పీ నియోజకవర్గం అభ్యర్థి దాసరి ఉష అన్నారు.పట్టణంలోని తన స్వగృహం నందు ఓదెల మండలానికి చెందిన కంకణాల సంజీవరెడ్డి మాజీ ఉపసర్పంచ్ (కాంగ్రెస్) ఇందుర్తి, కర్ర సదయ్య రైతు సమన్వయ కమిటీ మెంబర్ (బీఆర్ఎస్) గూడెం, ఆరెల్లి రాధా వార్డ్ మెంబర్ పలువురు నాయకులకు బీఎస్పీ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ అసెంబ్లీ అధ్యక్షుడు బొంకూరి దుర్గయ్య, అసెంబ్లీ కోశాధికారి ఎండి రియాజ్, కాల్వ శ్రీరాంపూర్ మండల అధ్యక్షుడు కుమ్మరికుంట రవికుమార్, కుమార్, సంపత్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్‌లోకి పలువురి చేరికలు

నవతెలంగాణ-ముత్తారం: ముత్తారం మండలంలోని కాంగ్రెస్, బీజేపీ నాయకులు భారీగా బీఆర్ఎస్‌లో చేరారు. మండల కేంద్రానికి చెందిన బీజేపీ మండల నాయకులు మారం శ్రీనివాస్ రెడ్డి, ఓడేడు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఇన్‌ఛార్జీ దాసరి పవన్ కుమార్, కేశనపల్లి, పారుపల్లి, మైదంబండ, సర్వారం గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సుమారు 100 మంది బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి మంథని బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి పుట్ట మధూకర్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పోతిపెద్ది కిషన్ రెడ్డి, ఎంపీపీ జక్కుల ముత్తయ్య పటేల్, జడ్పీటీసీ చెలుకల స్వర్ణలత అశోక్ యాదవ్, వైస్ ఎంపీపీ సుదాటి రవీందర్ రావు, రైతు బంధు మండల శాఖ అధ్యక్షుడు అత్తె చంద్రమౌళి, సర్పంచ్‌ల ఫోరం మండల శాఖ అధ్యక్షుడు నూనె కుమార్, నాయకులు పాల్గొన్నారు.

పోలీసు అమరుల త్యాగాలు మరవొద్దు
సిరిసిల్ల డీఎస్పీ ఉదయ్‌రెడ్డి



సంస్మరణ దినోత్సవం జరుపుకుంటున్న పోలీసులు

నవతెలంగాణ - సిరిసిల్ల రూరల్ : శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరులను ప్రజలు మరువొద్దని సిరిసిల్ల డీఎస్పీ ఉదయ్‌రెడ్డి అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్కరణ దినోత్సవాన్ని(ఫ్లాగ్ డే) పురస్కరించుకోని టౌన్ పోలీస్, ఎన్జీవో ఆధ్వర్యంలో సిరిసిల్ల టౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట ఏర్పాటు చేసిన కొవ్వొత్తిని వెలిగించి అమరవీరులకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టౌన్ సీఐ ఉపేందర్, ఎస్ఐ ప్రేమనదం, ఆర్ఎస్ఐ రమేష్ పోలీస్ సిబ్బంది, ఎన్జీవో ఓజా పాల్గొన్నారు.

SRI SHIVANI INSTITUTE OF MANAGEMENT
Vill: ISLAMPUR, Mdl: Gangadhara, Dist., KARIMNAGAR
(Affiliated to Satavahana University, Approved by AICTE, New Delhi
Contact: 7013189192, 7075487078, e-mail: srishivanimba@gmail.com
Admission Notificatation-Category (B) Seats Management Quota
Applications are invited from the eligible candidates for Admission into MBA management Quota(Category -B) seats for Academic Year 2023-2024. Contact to college Office with filled application form and required certificates. Sd/-
Notification: TSCHE-B-CATEGORY-MBA. -Principal/Correspondent

కాంగ్రెస్ పార్టీలోకి బీజేపీ నాయకులు

నవతెలంగాణ-గోదావరిఖని:
పాలకుర్తి మండలం పుట్నూర్ గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు పుట్నూర్ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు తోట ప్రశాంత్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ రామగుండం నియోజకవర్గ అభ్యర్థి మక్కాన సింగ్ రాజ్ ఠాకూర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాజ్ ఠాగూర్ మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన నడుస్తుందని, ప్రతి ఒక్కరు బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు బుద్ధి చెప్పాలని కోరారు. ఈ కార్యక్ర మంలో పాలకుర్తి కాంగ్రెస్ పార్టీ మండల ప్రెసిడెంట్ ముక్కెర శ్రీనివాస్, వాసుదేవరావు, మునిగాలా ప్రసాద్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


కండువా కప్పి ఆహ్వానిస్తున్న మక్కాన్‌సింగ్

తెలంగాణ ప్రజలకు కేసీఆర్ క్షమాపణ చెప్పాలి

టీడీపీ రామగుండం నియోజక వర్గ ఇన్‌చార్జీ పెద్దపల్లి సత్యనారాయణ

నవతెలంగాణ-గోదావరిఖని:
మేడిగడ్డ కాళేశ్వరం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ రివర్స్ పంపింగ్ కోసం ఒక లక్ష అరవై వేల కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి నిర్మించి, లక్ష ఎకరాలకు నీరందిస్తానని కేసీఆర్ చెప్పడం తెలంగాణ ప్రజలను మోసం చేయడమేనని, తెలంగాణ ప్రజల కు కేసీఆర్ క్షమాపణ చెప్పాలని తెలుగుదేశం పార్టీ రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జీ పెద్దపల్లి సత్యనారాయణ డిమాండ్ చేశా రు. ఈ మేరకు పెద్దపల్లి కలెక్టరేట్ ముందు బుధవారం నిరసన తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఒక ఎకరానికి కూడా నీరు ఇవ్వ కుండా సిద్దిపేట, గజ్వేల్ ,హైదరాబాద్‌కు కేసీఆర్ ఎర్రవెల్లి ఫామ్ హౌస్‌కు నీరు తరలించి తన భూములకు సాగునీటిని అందించు కొని తెలంగాణ అంతా పచ్చబడుతుందని తన మాటలతో మోసం చేస్తున్న కేసీఆర్ నిజస్వరూపం ఇప్పుడు బట్టబయలు అయిందని అన్నారు. మేడిగడ్డ ప్రాజెక్టుకు సంబంధించిన రెండు పిల్లర్స్ కంగిపోయి బ్రిడ్జి శిథిలావస్తులకు చేరిందని, ఇంజనీర్ల యొక్క అసమర్థత దీంతో స్పష్టమవుతుందని అన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రామగుండం కార్పొరేషన్ అధ్యక్షులు కోటగిరి పాపయ్య, ప్రధాన కార్యదర్శి సంగెపు రాజు, టీఎన్‌టీయూసీ పెద్దపల్లి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు సల్ల రవీందర్, తదితరులున్నారు.


నిరసన తెలుపుతున్న టీడీపీ నాయకులు

రామగుండం కార్పొరేషన్ బీఆర్ఎస్ యువజన విభాగం అధికార ప్రతినిధిగా చింతల సాయి యశ్వంత్ రెడ్డి

నవతెలంగాణ-గోదావరిఖని:
రామగుండం కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం అధికార ప్రతినిధిగా చింతల సాయి, యశ్వంత్ రెడ్డిని నియమించడం జరిగింది. ఈ మేరకు రామ గుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ నియా మకం పత్రాన్ని అందజేశారు. పార్టీ విస్తరణకు పాటుపడటంతో పాటు పార్టీ కార్యక్రమాలను, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి చేరవేయడంలో ముందుం డాలని వారికి ఎమ్మెల్యే సూచించారు. తమ నియామకానికి సహక రించిన ఎమ్మెల్యే కోరుకంటి చందర్, డిప్యూటీ మేయర్ నడిపల్లి అభి షేక్ రావు, కోఆప్షన్ సభ్యులు తస్లీమా బేగం, జావెద్ పాషా, రామ గుండం నియోజక వర్గ అధికార ప్రతినిధి బెంద్రం రాజిరెడ్డి, రామ గుండం నియోజక వర్గ యూత్ కోఆర్డినేటర్ దొమ్మేటి వాసు, కార్పొరే షన్ యూత్ కో ఆర్డినేటర్ పల్లె హరీష్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.


నియామకపు ఉత్తర్వులు అందజేస్తున్న ఎమ్మెల్యే

కేసీఆర్ పాలనకు ఆకర్షితులై బీఆర్ఎస్ పార్టీలో చేరికలు

- రామగుండం శాసనసభ్యుడు కోరకంటి చందర్

నవతెలంగాణ-గోదావరిఖని:
తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ సంక్షేమ పాలనకు ఆకర్షితులై బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని రామగుండం శాసన సభ్యుడు కోరుకంటి చందర్ అన్నారు. బుధవారం 6వ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ అంతా ర్గం మండల నాయకుడు మడ్డి బాపు గౌడ్ బీఆర్ఎస్ పార్టీలో చేరగా ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రామగుండం నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు.


పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపిన ఘనత కేసీఆర్‌దే

రామగుండం బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కోరుకంటి చందర్

నవతెలంగాణ-గోదావరిఖని:
తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని రామగుండం ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. బుధవారం రామగుండం కార్పోరేషన్ పరిధిలోని 6,7 డివిజన్లో ఎమ్మెల్యే ప్రజా అంకిత యాత్రను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పాలన అంతా చీకటిమయం అని, 60 ఏళ్ల కాంగ్రెస్ పాలన మూలంగానే తెలంగాణ రాష్ట్రంలో ప్రజల కష్టాలు నెలకొన్నాయని అన్నారు. సంక్రాంతి సమయంలో గంగిరెద్దుల వాళ్ల వచ్చే విధంగా హైదరాబాద్‌లో భూకబ్జాలు దందాలు చేసి సంపాదించిన డబ్బులతో వచ్చే నాయకుల మాటలను ప్రజలు నమ్మవద్దన్నారు. నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి రామగుండం నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రామగుండం నగర డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్ రావు, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు మూల విజయారెడ్డి, కార్పొరేటర్ కాల్వ స్వరూప శ్రీనివాస్, కో ఆప్షన్ సభ్యురాలు తస్నీంభాను, బీఆర్ఎస్ పార్టీ నాయకులు గంగ శ్రీనివాస్,తదితరులున్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్

అక్టోబర్ 31 వరకు ఫిట్ ఇండియా క్విజ్ రిజిస్ట్రేషన్ గడువు

జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి ఏ.సురేష్

నవతెలంగాణ- పెద్దపల్లి
ఫిట్ ఇండియా క్విజ్ 2023లో పాల్గొనుటకు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు గడువు అక్టోబర్ 31 వరకు ఉందని, ఆసక్తి గలవారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి ఏ.సురేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి భారతీయ పౌరుడు శారీరకంగా చురుకైన జీవనశైలి అనుసరించేలా ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఫిట్ ఇండియా కార్యక్రమాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆగస్టు 2019లో ప్రారంభించారని, పాఠశాల విద్యార్థుల్లో ఫిట్ ఇండియా సందేశాన్ని తీసుకెళ్ళేందుకు ఫిట్ ఇండియా రూపొందించబడిందని, ఇందులో పాల్గొన్న విద్యార్థులు మూడు కోట్లకు పైగా విలువైన నగదు బహుమతులు గెలుచుకోవచ్చని అన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ప్రిలిమినరీ రౌండ్ కోసం అక్టోబర్ 31 వరకు https://fitindia.nta.ac.in/i/registerవెబ్ సైట్లో రిజిస్టర్ చేసుకోవాలని , ప్రతి పాఠశాల గరిష్ట పరిమితి లేకుండా కనీసం ఇద్దరు విద్యార్థులను నామినేట్ చేయాల్సిందిగా తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ సూచించడం జరిగిందని, ఆసక్తిగల విద్యార్థులు తప్పనిసరిగా రిజిస్టర్ చేసుకోవాలని జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

జీడీకే-5వ గనిని సందర్శించిన జీఎం

నవతెలంగాణ-గోదావరిఖని:
సింగరేణి ఆర్జీ-1 ఏరియాలోని జీడీకే- 2వ గనిలోని 4వ సీమ్ 4ఎస్/16 ప్యానెల్‌ను ఏరియా జీఎం చింతల శ్రీనివాస్ గని అధికారులతో కలిసి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్యానల్‌కు సంబంధించి రక్షణ సూచనలు ఇవ్వడంతోపాటు ఉత్పత్తి, ఉత్పా దకతపై చర్చించారు. జీడీకే 2అండ్2ఎ గనికి నిర్దేశిం చిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, అన్నారు. జీఎంతోపాటు గని ఏజంట్ చంద్రశేఖర్, కాలరీ మేనేజర్ తిరుపతి, సేఫ్టీ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు ఉన్నారు.


గనిలోకి దిగుతున్న జీఎం

లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా బారీ


బారీని సన్మానిస్తున్న నాయకులు

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్
తెలంగాణ లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా పెద్దపల్లికి చెందిన షేక్ అబ్దుల్ బారీ నియామకమయ్యారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఎన్నికల్లో బారీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధ్యక్షుడు అంజిరెడ్డి ప్రకటించారు. పెద్దపల్లి లారీ అసోసియేషన్ అధ్యక్షుడుగా అనేక పర్యాయాలు పనిచేస్తున్న బారీ లారీ ఓనర్స్ సమస్యల పరిష్కారంలో చేసిన కృషిని గుర్తించి రాష్ట్ర కమిటీలో కీలక బాధ్యతలు అప్పగించారు. ఈసందర్భంగా అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం సభ్యులు బారీని ఘనంగా సత్కరించారు. తన ఎన్నికకు సహకరించిన అందరికీ బారీ కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా సుతారి లక్ష్మన్ బాబు

నవతెలంగాణ-గోదావరిఖని:
కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా సుతారి లక్ష్మన్ బాబు నియామకం అయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్ రామగు ండం అభ్యర్థి, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఆయనకు నియామకపు ఉత్తర్వులను అందజేశారు. తనను జిల్లా అధికార ప్రతినిధి నియమించినందుకు పార్టీ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌కు సుతారి లక్ష్మణ్ బాబు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.


ఉత్తర్వులను అందజేస్తున్న మక్కాన్‌సింగ్

పోడు పట్టాలు ఇవ్వాలని వినతి

నవతెలంగాణ-మంథని
మంథని డివిజన్ పరిధిలోని అధికార పార్టీ బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎస్టీ నాయకపోడు కులస్తులకి పోడు భూమి పట్టాలు ఇప్పించకపోవడం సిగ్గుచేటని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్ విమర్శించారు. బుధవారం మంథని మండలం వెంకటపూర్ గ్రామానికి చెందిన నాయకపోడు కులానికి చెందిన గిరిజనులు పట్టాలు ఇవ్వాలని మంథని ఆర్డీవో కార్యాలయంలో ఏవో తూము రవీందర్ కు వినతి పత్రాన్ని అందజే శారు. ఈ సందర్భంగా ఎన్నికల ముందు ముఖ్యమంత్రి కేసీఆర్ పోడు భూముల సమస్య ఉన్న గ్రామాలలో కుర్చీ వేసుకొని పోడు సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చి మోసం చేశారని అన్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఫారెస్ట్,రెవెన్యూ అధికారులచే జాయింట్ సర్వే చేసి పోడుపట్టాలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎన్నికల్లో అధికార పార్టీకి తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ల సందీప్,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్పుల సురేష్,సత్యం,లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.


ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

కేసీఆర్ గెలుపు కోసం ప్రార్థించిన కోలేటి దామోదర్

నవతెలంగాణ-గోదావరిఖని:
తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల వీక్షణ పరమ పవిత్ర మైనదని, అందు లో ముఖ్యంగా చక్ర స్నాన ఘట్టం అత్యంత పవిత్రమై నదని, ఆ సమ యంలో కోరిన కోరి కలు నెరవేరుతాయన్నది భక్తు ల సంపూర్ణ విశ్వాస మని తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ కోలేటి దామోదర్ బ్రహ్మోత్సవాల సమయంలో తిరుమలలో శ్రీవారిని దర్శించుకుని, టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ఈవో ధర్మారెడ్డితో కలిసి బ్రహ్మోత్సవాల చివరి రోజున చక్రస్నాన ఘట్టాన్ని వీక్షించారు. ఆ సమయంలో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌కీ బీఆర్ఎస్ పార్టీకి రానున్న అసెంబ్లీ ఎన్నికలలో ఘన విజయం సిద్ధించాలని కోరుకున్నట్లుగా ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ ఎన్నికలలో బీఆర్ఎస్ ఘన విజయం సాధించి, హ్యాట్రిక్ ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టాలని ఆకాంక్షించారు.


దర్శించుకుంటున్న కోలేటి దామోదర్

స్పీస్ ర్యాలీని విజయవంతం చేయండి

ఆర్డీవో హనుమాన్ నాయక్



నవతెలంగాణ-మంథని
మంథని పాత పెట్రోల్ బంక్ నుంచి ప్రభుత్వ జూనియర్ బాలుర కళాశాల వరకు మహిళలతో ఓటర్ అవగాహన కార్యక్రమంతో పాటు స్పీస్"ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని మంథని ఆర్డీవో హనుమాన్ నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉద్యో గులు,అధికారులు, పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వహించాలి

కరీంనగర్ జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ బి.గోపి



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ బి.గోపి

నవతెలంగాణ - కరీంనగర్

జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఏర్పాటు చేసిన బృందాలన్ని పకడ్బందీగా విధులు నిర్వర్తించాలని కరీంనగర్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ బి.గోపి తెలిపారు. ఎన్నికల విధులు, బాధ్యతలపై రిటర్నింగ్ అధికారులు, తహసీల్దార్లు, ఎఫ్ఎస్టీ, వీఎస్టీ, ఎంపీడీఓలతో సీపీతో కలిసి అయన బుధవారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా దిశా నిర్దేశనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎన్నికల విధులకు కేటాయించిన సిబ్బంది అందరు విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ మొదలగు ప్రభుత్వ పరమైన కార్యక్రమాలలో రాజకీయ పార్టీల ప్రమేయం లేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. పండుగలు, ఇతర కార్యక్రమాలకు సంబంధించి శుభాకాంక్షలను తెలియజేస్తూ రాజకీయ పార్టీల ప్రతినిధులెవరు వాల్ రైటింగ్, పోస్టర్లు, బ్యానర్లను ఏర్పాటు చేయకుండా చూడాలన్నారు. ఇది వరకు ఏర్పాటు చేసిన బ్యానర్లను వెంటనే తొలగించాలని, నియోజకవర్గాల వారిగా మీ పరిధిలో ఏవైనా అనుమతిలేని పోస్టర్లు ఏర్పాటు చేస్తున్నట్లుగా భావించిట్లయితే వాటిని సుమోటోగా స్వీకరించి ఎన్నికల ప్రవర్తన నియామవళి మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. సర్వే లైన్ బృందాలు, చెక్ పోస్టులలో సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. రిటర్నింగ్ అధికారులందరు చెక్‌పోస్టులతో పాటు ఏర్పాటు చేసిన బృందాల పనితీరును ఆకస్మికంగా తనిఖీ చేయాలని, కేటాయించిన సిబ్బందికి అటెండెన్స్, మూవ్‌మెంట్ రిజిష్టర్లను పరిశీలించాలని తెలిపారు. జిల్లా నుంచి కూడా నియోజవర్గాల పనితీరును పర్యవేక్షిస్తామన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులు సెలవులతో సంబంధం లేకుండా 24/7 తనిఖీలు చేపట్టాలని, విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై ఎన్నికల ప్రవర్తన నియావళి మేరకు కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రిటర్నింగ్ అధికారులు ప్రతిరోజు నివేదికలను పంపించాలన్నారు. క్షేత్రస్థాయిలో వచ్చే ప్రతి ఫిర్యాదులపై తక్షణం స్పందిస్తూ ఎన్నికల నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. ముందస్తు అనుమతి లేకుండా ఎవరు వారి విధులను వదిలి వెళ్లకూడదన్నారు. రిటర్నింగ్ అధికారులు జారీ చేసే అనుమతులకు సంబంధించిన వివరాలను వాట్సప్ గ్రూప్‌ల ద్వారా తెలియజేయాలన్నారు. జారీ చేసిన అనుమతులకు మించి వాహనాలను వాడకుండా చూడాలని, సభలు, సమావేశాల వివరాలు కచ్చితంగా వీడియో రికార్డు చేయించాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది అందరికి ఐడీ కార్డులను జారీ చేయాలని, వీడియో గ్రాఫర్లు ఉండేలా చూసుకోవాలన్నారు. అవసరం మేరకు అదనపు సిబ్బందిని కూడా నియమిస్తామని తెలిపారు. సీపీ ఎల్.సుబ్బారాయుడు మాట్లాడుతూ.. రాజకీయ పార్టీలు చేపట్టే ప్రచారాలలో సమావేశాలు, సభలు నిర్వహించే చోట ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలు జరగకుండా కట్టుదిట్టంగా పర్యవేక్షించాల్సి ఉంటుందన్నారు. ఎస్ఎస్ఎస్టీ, ఎంసీసీ టీంల సిబ్బంది అందరు వారి విధులకు సక్రమంగా నిర్వహించాలని, సిబ్బంది విధులకు హాజరుకానట్లయితే పై అధికారులకు వెంటనే సమాచారం అందించాలని, అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. వాహనాలు, సమావేశాలకు సంబంధించిన అనుమతులను కచ్చితంగా పరిశీలించాలని అన్నారు. టెలీకాన్ఫరెన్స్‌లో రిటర్నింగ్ అధికారులు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, కే.మహేశ్వర్, రాజు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

కారు, బైక్ ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు



నవతెలంగాణ - శంకరపట్నం

బైక్‌ను కారు ఢీకొట్టడతో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. శంకరపట్నం మండలం రాజాపూర్ గ్రామానికి చెందిన మాతాంగి నారాయణ విద్యుత్ శాఖలో లైన్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం తన బైక్‌పై కేశవపట్నం వెళు న్నాడు. కరీంనగర్ నుండి హుజురాబాద్ వైపు వెళ్తున్న కారు మొలంగూర్ ఎక్స్‌రోడ్ వద్ద బైకును ఢీకొట్టింది. నారాయణకు రెండు కాళ్లు విరిగి రోడ్డుమీద పడడంతో స్థానికులు 108కి ఫోన్ చేయడంతో సిబ్బంది ఈఎంటి సతీష్ రెడ్డి, పైలెట్ కాజా ఖలీల్ ఉల్లా సంఘటన స్థలానికి చేరుకొని ప్రథమ చికిత్స అందిస్తూ, హుజురాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

బొమ్మకల్ నుంచి మంత్రి గంగుల ప్రచారం ప్రారంభం

యజ్ఞవరాహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్



నవతెలంగాణ - కరీంనగర్ / కరీంనగర్ రూరల్

కరీంనగర్ మండలం బొమ్మకల్ నుంచి ప్రచార శంకారావాన్ని మంత్రి గంగుల కమలాకర్ పూరించారు. కరీంనగర్ యజ్ఞవరాహ స్వామి ఆలయంలో మంత్రి గంగుల కమలాకర్ కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. బొమ్మకల్ శ్రీసీతారామ చంద్రాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రచారాన్ని ప్రారంభించారు. మహిళల మంగళ హారతులు, కోలాటాలు, డప్పుచప్పుళ్ల మధ్య మంత్రి గంగుల ముందుకు సాగారు. ప్రజలు టపాసులు కాల్చి, పూలవర్షం కురిపించి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. ఎవరికి లేని విధంగా కరీంనగర్ గడ్డపై హ్యాట్రిక్ విజయాలు కట్టబెట్టిన ప్రతి ఒక్కరికి శిరస్సు వంచి నమస్కారాలు అని తెలిపారు. ప్రతి ఎన్నిక ప్రచారం బొమ్మకల్ నుంచి ప్రారంభించడం నాకు ఆనవాయితీగా వస్తుందన్నారు. ఇక్కడి శ్రీసీతారామచంద్ర ఆలయంలో పూజలు నిర్వహించి, కల్వ నర్సయ్య యాదవ్ ఇంటి నుంచి ప్రచారాన్ని ప్రారంభిస్తాను అని తెలిపారు. ఈసారి కల్వ నరసయ్య లేకపోవడం బాధకరమే అయినప్పటికీ, ఆయన కుటుంబ సభ్యుల అండతో ఈ సంవత్సరం ప్రచారాన్ని ప్రారంభించానని చెప్పారు. తెలంగాణ రాకముందు బొమ్మకల్ ఎలా ఉంది, ఇప్పుడు ఎలా ఉందో ఒకసారి ఆలోచించాలన్నారు. 40 నుంచి 50 సంవత్సరాల సమైక్య పాలనలో రోడ్లు లేక సాగునీరు రాక దరిద్రాన్ని చూసాం అని, కరెంటు కోసం ఆందోళన చేస్తే పోలీసులు నా కాలు విరగగొట్టిన రోజులు ఇంకా గుర్తున్నాయి అని వివరించారు. 10 సంవత్సరాల్లో కరీంనగర్ రూపురేఖలు మార్చి గొప్పగా అభివృద్ధి చేశాం అన్నారు. రైతుబంధు, కళ్యాణలక్ష్మి, రైతు బీమా, ఆసరా లాంటి పథకాలతో నిరుపేదలకు అండగా నిలిచాం అని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీలు ఢిల్లీ పార్టీలు అని, సమైక్య పాలనలో హైదరాబాద్ సంపదను దోచుకుని తెలంగాణను ఎండబెట్టారు అని విమర్శించారు. మన తెలంగాణను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. పచ్చని తెలంగాణను దోచుకునేందుకు మళ్లీ ఢిల్లీ పార్టీలైనా కాంగ్రెస్, బీజేపీ లు వస్తున్నాయని, కేసీఆర్‌ను ఓడగొట్టి పచ్చని తెలంగాణను మళ్లీ ఆంధ్రాలో కలిపేందుకు సమైక్య పాలకులు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. షర్మిలమ్మ, కేవీపీ మాజీ సీఎం నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి హైదరాబాద్‌లో పాగా వేశారని, కాంగ్రెస్ బీజేపీల మాటలు నమ్మితే మన భవిష్యత్ తరాల జీవితాలు మరోసారి అంధకారం అవుతాయి అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇప్పటికీ తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నారని అన్నారు. తెలంగాణను కాపాడేది కేసీఆర్ మాత్రమే, కేసీఆర్‌ను గెలిపించుకుందాం తెలంగాణను కాపాడుకుందాం అన్నారు. 2014 నుంచి ఇప్పటి వరకు బొమ్మకల్‌లో రూ.18కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాను అని, చెప్పింది చేతల్లో చేసి చూపించేతత్వం సీఎం కేసీఆర్‌ది అన్నారు. నన్ను మరోసారి గెలిపిస్తే నిధులు తెచ్చే బాధ్యత నాది అని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.



మంత్రి గంగులకు ఆత్మీయ స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

బీఆర్ఎస్ పార్టీలో చేరికలు..



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

నవతెలంగాణ - తిమ్మాపూర్

మండలంలోని పోలంపల్లి, నర్సింగాపూర్ గ్రామాల్లోని కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలతో పాటు వివిధ కుల సంఘాల నాయకులు, యువకులు భారీ సంఖ్యలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే రసమయి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం బీఆర్ఎస్ మైనార్టీ సెల్ తిమ్మాపూర్ మండల ఉపాధ్యక్షుడిగా మహ్మద్ నబీ, మండల యూత్ ఉపాధ్యక్షుడిగా కోతి నరేష్, మండల యూత్ ప్రధానకార్యదర్శిగా సంగాల పవన్, మండల విద్యార్థి విభాగం ఉపాధ్యక్షుడిగా ఉపాధ్యక్షుడిగా గొట్టిపర్తి మధుకర్‌ను నియమిస్తూ నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ల్యాగల వీరారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాసరావు, కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రావుల రమేష్, గట్టు దుద్దెనపల్లి సహకార సంఘం చైర్మన్ అనభేరి రాధాకిషన్‌రావు, ఎంపిటిసి పుప్పాల కనకయ్య ఆత్మ కమిటీ చైర్మన్ పాశం అశోక్‌రెడ్డి, ఖమ్మం కృష్ణ, తోట మధు, పేరుక రవి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌పై ప్రజల్లో విశ్వాసం లేదు

బీఆర్ఎస్ మంథని అభ్యర్థి పుట్ట మధూకర్



మాట్లాడుతున్న పుట్ట మధూకర్

నవతెలంగాణ-ముత్తారం : ఎన్నో ఏళ్లు పాలించినా అభివృద్ధి చేయని కాంగ్రెస్‌పై ప్రజల్లో విశ్వాసం లేదని బీఆర్ఎస్ మంథని ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్ అన్నారు. ముత్తారం మండల కేంద్రంలోని వెంకటలక్ష్మి గార్డెన్స్‌లో జరిగిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ అనతి కాలంలోనే ఎంతో అభివృద్ధి చేసిన బీఆర్ఎస్ పార్టీ అంటేనే ఒక నమ్మకం, ఒక విశ్వాసమని అన్నారు. మూడోసారి బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వమే ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న క్రమంలో కాంగ్రెస్ నాయకులు కొత్త కొత్త అబద్దాలతో ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకునే ప్రయత్నాలు చేస్తున్నారని, కేవలం గ్యారెంటీ లేని ఆరు పథకాలను, డబ్బు సంచులతో గెలువాలనే ఆలోచన చేస్తున్నారని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోతిపెద్ది కిషన్ రెడ్డి, ఎంపీపీ జక్కుల ముత్తయ్య పటేల్, జడ్పీటీసీ చెలుకల స్వర్ణలత అశోక్ యాదవ్, వైస్ ఎంపీపీ సుదాటి రవీందర్ రావు, రైతుబంధు మండల శాఖ అధ్యక్షుడు అత్తె చంద్రమౌళి, సర్పంచ్‌ల ఫోరం మండల శాఖ అధ్యక్షుడు నూనె కుమార్, మహిళా మండల అధ్యక్షురాడు పప్పు స్వరూపలతోపాటు ప్రజాప్రతినిధులు, నాయకులు, ముఖ్య కార్యకర్తలు, పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మెన్ సమావేశం



నవతెలంగాణ - కొత్తపల్లి

కొత్తపల్లి మున్సిపల్ పట్టణంలో రాబోవు అసెంబ్లీ ఎలక్షన్ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ రుద్రరాజు తన ఆఫీస్‌లో వాసాల రమేష్, ఎండీ జమీలుద్దీన్ సమక్షంలో బూత్ ఇన్‌చార్జిలు కౌన్సిలర్లు, కన్వీనర్లు, కో కన్వీనర్లు సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ కరీంనగర్ అభ్యర్థి గంగుల కమలాకర్‌ని కొత్తపల్లి పట్టణంలో భారీ మెజార్టీ ఇచ్చి గెలిపించుకోవాలని కోరారు.

టీజీపీఏ కుటుంబానికి భరోసా



నవతెలంగాణ - మానకొండూర్

కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం పచ్చునూరు గ్రామంలో ఇటీవల మృతిచెందిన టీజీపీఏ సెక్యూరిటీ ఫోర్స్ కన్వీనర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దాసారపు సదానందం నాయనమ్మ ఎల్లమ్మ చిత్రపటానికి టీజీపీఏ రాష్ట్ర అధ్యక్షుడు అంబాల ప్రభు పూలమాల వేసి నివాళులర్పించారు. 50 కేజీల బియ్యం అందజేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుడిసె పవన్, జిల్లా అధ్యక్షుడు జీడి వెంకట స్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి దూడపాక శ్రీనివాస్, ఉపాధ్యక్షులు సంగుపట్ల మల్లేష్ ఉన్నారు.

గల్ఫ్ కార్మికుల అండతో ఎన్నికల్లో పోటీ

- సీఎస్ఆర్ చైర్మన్ శ్రీనివాసరావు

నవతెలంగాణ-కోరుట్ల

పార్టీలకతీతంగా కోరుట్ల నియోజకవర్గంలో గల్ఫ్ కార్మికుల అండతో ఎమ్మెల్యేగా పోటీ చేస్తామని సీఎస్ఆర్ చైర్మన్ శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని జీజీ కాంప్లెక్స్‌లో విలేకర్లతో మాట్లాడారు. నీళ్లు, నియామకాలతో ఏర్పాటు తెలంగాణలో అన్యాయం జరిగిందన్నారు. ఉద్యమంలో కేసీఆర్ గల్ఫ్ కార్మికులకు రూ.100 కోట్లతో బోర్డు ఏర్పాటు చేస్తామని చెప్పి మోసం చేశారని అన్నారు. కనీస గల్ఫ్ దేశాల్లో చనిపోయిన వారికి కుటుంబాలకు రూ.5లక్షల బీమా ఇవ్వలేదన్నారు. గల్ఫ్ దేశాల్లో రోజుకోకరు చనిపోతున్నారని, 15 రోజు కొక మృతదేహం వారి కుటుంబాలకు చేరుతోందన్నారు. కోరుట్ల నియోజకవర్గంలో గల్ఫ్ దేశాలకు వెళ్లిన వారి కుటుంబాలు 28వేలు ఉన్నాయని చెప్పారు. అనంతరం రాష్ట్ర గల్ఫ్ కార్మికుల అధ్యక్షుడు గుగ్గిళ్ల రవిగౌడ్ మాట్లాడుతూ.. ఈ నెల 14న దుబాయ్‌లో పార్టీలకతీతంగా సమావేశం నిర్వహించి, ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఆరు అసెంబ్లీ నియోజక వర్గాల్లో పోటీ చేస్తామని స్పష్టం చేశారు. ఒక్క రూపాయి ఖర్చు పెట్టకుండా గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. 28వేల కుటుంబాలల్లో కుటుంబానికి 3 చొప్పున ఓట్లతో మొత్తం 90వేలతో ఘనంగా గెలిచి అసెంబ్లీలో గొంతు వినిపిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో గల్ఫ్ కార్మికుల రాష్ట్ర కార్యదర్శి బూత్కూరి కాంత, వలస కార్మికుల విశ్లేషకులు మంద భీమరెడ్డి, సీపీఐ నాయకులు చెన్న విశ్వనాథం, కార్మిక శక్తి అధ్యక్షుడు రాపెల్లి శ్రీనివాస్, నాయకులు బైరి రవి, మోహన్‌రెడ్డి, కారం మారుతి, అశోక్, గల్ఫ్ కార్మికులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

బీఆర్ఎస్ పాలనలో అన్ని వర్గాలకు లబ్ది

- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-రాయికల్

బీఆర్ఎస్ పాలనలోనే అన్ని వర్గాల అభ్యున్నతి జరిగిందని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన 10 మంది యువకులు మండల కో ఆప్షన్ సభ్యులు యం.ఏ. మోహీద్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరగా ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాటాడుతూ... సమైక్య రాష్ట్రంలో వ్యవసాయం దండుగా అయితే సీఎం కేసీఆర్ సారథ్యంలో వ్యవసాయాన్ని పండగలా మార్చారన్నారు. రైతుబంధు, రైతు భీమా వంటి పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నా యన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మోర విజయలక్ష్మి వెంకటేష్, సింగిల్ విండో చైర్మన్ రాజ లింగం,మండల ఉప అధ్యక్షుడు అనుమల్ల మహేష్, గ్రామశాఖ అధ్యక్షుడు రత్నాకర్‌రావు, ఎంబరి వెంకటేష్, తిరుపతిగౌడ్, వార్డ్ మెంబర్స్ ముదం శ్రీను, భోగ నర్సయ్య, పోతు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

రాయికల్ మండలంలోని పలు గ్రామాలకు చెందిన పలువురు మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ బుధవారం పరామర్శించారు. వారి వెంట ఎంపీపీ లావుడియ సంధ్యారాణి సురేందర్ నాయక్, జడ్పీటీసీ జాదవ్ అశ్విని, సర్పంచులు బెక్కెం తిరుపతి, బత్తిని రాజేశం,బెజ్జంకి రమాదేవి, జక్కుల చంద్రశేఖర్, ఎంపీటీసీ మందుల శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు కోల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి తలారి రాజేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల కార్యదర్శిగా సురేందర్

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట

కాంగ్రెస్ మండల కార్యదర్శిగా ఉడుగుల సురేందర్‌ను నియమించినట్టు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి కమిటీలో కార్యదర్శిగా నియమించినట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు షేక్ గౌస్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు ఎండి రఫీక్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రాజునాయక్, భూపాల్‌రెడ్డి, నర్సింలు, దేవరాజు, సంతోష్‌గౌడ్, ఎండి ఇమామ్, బిపేట రాజులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి : ఎస్ఐ బి.మహేష్

నవతెలంగాణ - గంభీరావుపేట



రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని గంభీరావుపేట ఎస్ఐ బి.మహేష్ అన్నారు. బుధవారం గంభీరావుపేట పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకొని గురు వారం సిరిసిల్లలోని పద్మనాయక పంక్షన్ హల్‌లో రక్త దాన శిబిరం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. యువత భాగా స్వామ్యం కావాలని కోరారు. పాల్గొనే వారికి ఎస్పీ చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందజేస్తామన్నారు. పేర్ల నమోదు కోసం ఫోన్ నెంబర్ 8712656375, 9849010577 సంప్రదించాలని తెలిపారు.

మాట తప్పే అలవాటు కాంగ్రెస్‌కు లేదు

- కాంగ్రెస్ వేములవాడ నియోజకవర్గ అభ్యర్థి ఆది శ్రీనివాస్

నవతెలంగాణ - వేములవాడ



ప్రచార నిర్వహిస్తున్న ఆది శ్రీనివాస్..

మాట తప్పే అలవాటు కాంగ్రెస్ పార్టీకి లేదని, ఇచ్చిన హామీలను అది కారంలోకి వచ్చిన 90రోజుల్లో అమలు చేస్తామని వేము లవాడ నియోజకవర్గ అభ్యర్థి ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారం వేములవాడ పట్టణంలోని గాంధీనగర్, శివానగర్‌లో గడపగడపకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు 6 గ్యారంటీ పథకాలు కచ్చితంగా అమలు చేసి తీరుతామన్నారు. ఈ కార్యక్రమం లో కరీంనగర్ మహిళా జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్య ప్రసన్న, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి, పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో 100మంది యువకులు చేరిక



పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న మేడిపల్లి సత్యం

నవతెలంగాణ - బోయినిపల్లి

చొప్పదండి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జోరు పెంచింది. చొప్పదండి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌కి చెందిన నాయకులు, యువకులు కారు దిగి కాంగ్రెస్ కండువా కప్పుకుంటున్నారు. బోయినిపల్లి మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన 100మంది యువకులు అదే గ్రామానికి చెందిన దుబాయిలో ఉన్న వరాల నర్సింగం ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరిని చొప్పదండి నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ మేడిపల్లి సత్యం పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం సత్యం మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమని, ఆరు గ్యారంటీలను పక్కా అమలు చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కార్యాక్రమానికి సహకరించిన వరాల నర్సింగం, ఆకుల అజయ్, ల్యాగల దేవయ్యలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు భీమ్ రెడ్డి మహే శ్వర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ఎనుగుల కనకయ్య, తడగొండ ఎంపీటీసీ ఉయ్యాల శ్రీనివాస్ గౌడ్, ఉపసర్పంచ్ పిట్టల మోహన్,నాగుల వంశీ పాల్గొన్నారు.

నామినేషన్ ప్రక్రియపై పూర్తి అవగాహన ఉండాలి

- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి

నవతెలంగాణ - సిరిసిల్ల రూరల్

త్వరలో జరగనున్న సాధారణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రిటర్నింగ్ అధికారి కార్యాలయాలలో చేపట్టే నామినేషన్ ప్రక్రియపై రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో నామినేషన్ దాఖలు ప్రక్రియ పోస్టల్ బ్యాలెట్‌లపై రిటర్నింగ్ సహాయ రిటర్నింగ్ అధికారులు జిల్లా నోడల్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మాస్టర్ ట్రైనర్లు నామినేషన్ ప్రక్రియ పోస్టల్ బ్యాలెట్‌లపై అధికారులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. నామినేషన్ దాఖలు ప్రక్రియ మొత్తాన్ని వీడియోగ్రఫీ చేయాలన్నారు. అనంతరం పోస్టల్ బ్యాలెట్ శిక్షణ కార్యక్రమంను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడారు. ఈ అవకాశాన్ని ఎక్కువ మంది ఉపయోగించుకునేలా ఎన్నికల అధికారులు అవగాహన కల్పించాలని చెప్పారు. ఎన్నికల సంఘం ఈసారి నోటిఫైడ్ ఓటర్ల జాబితాను తాజాగా విస్తరించిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ జాబితాలో ఎన్నికల విధుల కారణంగా ఓటు వేయలేనివి అత్యవసర సేవల ఉద్యోగులకు తాజాగా స్థానం కల్పించిందన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు ఎన్ ఖీమ్యా నాయక్, గౌతమ్‌రెడ్డి, ఆర్డీఓలు ఆనంద్ కుమార్, మధుసూదన్, డీఆర్‌డీవో నక్క శ్రీనివాస్, సీపీవో పీబీ శ్రీనివాసచారి, మాస్టర్ ట్రైనర్లు, సహాయ రిటర్నింగ్ అధికారులు, జిల్లా నోడల్ అధికారులు పాల్గొన్నారు.



పాల్గొన్న రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు

కాంగ్రెస్‌తోనే పేదలకు భరోసా

- కరీంనగర్ పట్టభద్రులు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ

నవతెలంగాణ-రాయికల్

గడిచిన పదేళ్లలో నిరుపేదల వర్గాల అభ్యున్నతి నోచుకోలేరని రానున్న కాంగ్రెస్ పార్టీతోనే నిరుపేదలకు భరోసా కల్పిస్తామని కరీంనగర్ పట్టభద్రులు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. బుధవారం రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన మహిళలు కాంగ్రెస్‌లో చేరగా వారికి కండు వా కప్పి ఎమ్మెల్సీ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ రాబోయే ఎన్నికల్లో విజయం సాధించేందుకు కార్యకర్తలు, నాయకులు సమష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అత్తినేని గంగారెడ్డి, ప్రేమ్‌సాయి, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో నేతలకు పదవులు

నవతెలంగాణ - సిరిసిల్ల రూరల్

ఎన్నికల సమీపిస్తున్న కొద్దీ కాంగ్రెస్‌లో పదవుల వరంపర కొనసాగుతున్నది. సిరిసిల్ల పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ పలువురికి పలు పదవులను అప్పగించింది. దీంట్లో భాగంగానే బుధవారం పట్టణ ప్రధాన కార్యదర్శిగా మీడియా విభాగం ఆఫీస్ ఇన్‌చార్జిగా మ్యాన ప్రసాద్‌ను నియమించినట్టు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు చొప్పదండి ప్రకాష్ ఉత్తర్వులు జారీ చేశారు. పట్టణ ఉపాధ్యక్షునిగా అన్నల్దాస్ భాను, పట్టణ ప్రధాన కార్యదర్శిగా చౌటపల్లి వేణు, గోపాల్‌లను నియమించినట్టు తెలిపారు.



మేడిగడ్డ బ్యారేజీ నాణ్యతపై సీబీఐ విచారణ చేపట్టాలి



మాట్లాడుతున్న కేకే మహేందర్ రెడ్డి

నవతెలంగాణ - సిరిసిల్ల రూరల్

మేడిగడ్డ బ్యారేజీ నాణ్యత ప్రమాణాలపై సీబీఐ విచారణ జరిపించాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం సిరిసిల్ల ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు.కమీషన్ల కోసమే ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టారని, బ్యారేజీ నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం వల్లనే మేడిగడ్డ బ్యారేజ్ పగుళ్లు ఏర్పడ్డాయని ఆరోపించారు. సిరిసిల్ల మానేరు వాగుపై నిర్మించిన చెక్ డ్యాములు నాణ్యత లోపాలతో ధ్వంసమై పలువురి మరణాలకు కారణమయ్యాయన్నారు. బీఆర్ఎస్, బీజెపి రెండు ఒకటేనని వీటివల్ల భవిష్యత్ తరాలు బంధీ అవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో పట్టణ అధ్యక్షులు చొప్పదండి ప్రకాష్, జిల్లా మహిళా అధ్యక్షురాలు కాముని వనిత, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, నాయకులు ఉన్నారు.

ఈదుల లింగంపేటలో కాంగ్రెస్ ఇంటింటా ప్రచారం



వృద్ధులకు కాంగ్రెస్ గ్యారంటీలను వివరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-మేడిపల్లి

భీమారం మండలంలోని ఈదులలింగంపేట గ్రామంలో బుధవారం వేములవాడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆది శ్రీనివాస్ తరుపున కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సింగిరెడ్డి నరేష్ రెడ్డి ప్రచారం నిర్వహించారు. ఆరు గ్యారంటీలపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పసునూరు గ్రామ సర్పంచ్ లచ్చు నాయక్, మండల ఉపాధ్యక్షులు తోకల నరసయ్య, పుప్పాల కొమురయ్య, జిల్లా నాయకులు నీరటి మల్లేశం, ఉరుమడ్ల లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి జంగంపల్లి విజయ్, బీసీ సెల్ అధ్యక్షుడు ముంజ కిషన్‌గౌడ్, మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎండి సయ్యద్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు గణేష్, రాజిరెడ్డి, సర్వనందమ్ పాల్గొన్నారు.

దమన్నపేటలో బీఆర్ఎస్ ప్రచారం



పథకాలను వివరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-మేడిపల్లి

మేడిపల్లి మండలంలోని దమ్మన్నపేట గ్రామంలో సర్పంచ్ కాచర్ల సురేష్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు సత్తిరెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు వంగ వెంకటేశం, వైస్ ఎంపీపీ దొంతి శ్రీనివాస్, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు చెన్నమనేని రవీందర్‌రావు పాల్గొన్నారు.

జిల్లా సర్వసభ్య సమావేశం వాయిదా

నవతెలంగాణ-జగిత్యాల

జగిత్యాల జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా వేసినట్టు జడ్పీ ముఖ్య కార్య నిర్వహణ అధికారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దసరా, బతుకమ్మ పండుగల నేపథ్యంలో ప్రజా ప్రతినిధులు ఆయా గ్రామాలు, పట్ట ణాల్లో ప్రజలకు ఏర్పాట్లు చేయడంలో బిజీగా ఉన్నారని, త్వరలోనే సమావేశానికి సంబంధించిన తేదీలను ప్రకటిస్తామని చెప్పారు.

రక్తదానం చేసిన సైదు గంగాధర్

నవతెలంగాణ-మేడిపల్లి



మేడిపల్లి మండలంలోని పోరుమల్ల గ్రామానికి చెందిన గంగుకు గుండె ఆపరేషన్ కోసం రక్తం అవసరం కాగా విషయం తెలుసుకున్న తెలంగాణ పల్లెవాణి విలేకరి సైదు గంగాధర్ కరీంనగర్‌లోని ప్రయివేట్ ఆస్పత్రికి వెళ్లి రక్తదానం చేశాడు.

లోకబాపురెడ్డి పరామర్శ

నవతెలంగాణ-కథలాపూర్

కథలాపూర్ మండలం కో ఆప్షన్ సభ్యుడు మహమ్మద్ రఫీ తండ్రి బుధవారం మృతి చెందాడు. వారి కుటుంబాన్ని మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోకబాపురెడ్డి, జడ్పీటీసీ నాగం భూమయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వర్ధినేని నాగేశ్వరరావు, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాండ్రాల సర్పంచ్ గడీల గంగ ప్రసాద్, ఎంపీటీసీ రమేష్ పరామర్శించారు.



అవాంచనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు

- జగిత్యాల ఎస్పీ సన్ ప్రీత్ సింగ్

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు చేపడుతున్నామని జగిత్యాల ఎస్పీ సన్ ప్రీత్‌సింగ్ అన్నారు. ఎన్నికల్లో బందోబస్తు నిర్వహించడానికి బీఎస్ఎఫ్ కంపెనీ కేంద్ర సాయుధ పోలీసు బలగాలు జిల్లాకు చేరుకున్నాయి. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో కేంద్ర బాలగాల అధికారులతో ఎస్పీ సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికలకు బందోబస్తును కేంద్ర బలగాలతో నిర్వహించనున్నట్టు చెప్పారు. పోలింగ్ రోజు, ఎన్నికల తరువాత ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

జరగకుండా నియంత్రించడమే లక్ష్యంగా పని చేయడం జరుగుతుందన్నారు. త్వరలో మరో ఆరు కంపెనీల కేంద్రం సాయుధ బలగాలు జిల్లాకు రావడం జరుగుతుందన్నారు. వీరిని క్రిటికల్ పోలింగ్ స్టేషన్‌లలో రూట్ బందోబస్తు, కీలకమైన పాయింట్‌ల వద్ద సెంట్రల్ ఫోర్స్ సిబ్బందిని ఉంచనున్నట్టు తెలిపారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. అలాగే చెక్ పోస్ట్ దగ్గర పటిష్ట నిఘా ఏర్పాటు చేసి ముమ్మరంగా వాహన తనిఖీ చేపడుతామన్నారు. కేంద్ర బలగాలు ఉండడానికి సరైన వసతి ఏర్పాట్లు చేయాలని, వారితో కలిసి పని చేయాలని డీఎస్పీలను ఎస్పీ ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీలు ప్రభాకరరావు, భీంరావ్, బీఆర్ఎస్ అసిస్టెంట్ కమాండెంట్లు దివకార్, సునీల్‌కుమార్, డీఎస్పీలు రవీంద్రకుమార్, వెంకట స్వామి, రవీంద్ర రెడ్డి, టౌన్ ఇన్స్పెక్టర్ నటేశ్, ఎస్బి ఇన్స్పెక్టర్ నాగేశ్వం రావు పాల్గొన్నారు.

పార్టీ కోసం ఎంతో పని చేశా

- కానీ టికెట్ ఇవ్వలేదు..
- కొత్తగా పార్టీలో చేరిన వారికి టికెట్ ఎలా ఇస్తారు...
- బీజేపీ రాష్ట్ర నాయకులు ముదుగంటి రవీందర్‌రెడ్డి

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

పార్టీ బలోపేతం కోసం శ్రమించానని, తనను సంప్రదించకుండా కొత్త వారికి ఎలా టికెట్ ఇస్తారని బీజేపీ రాష్ట్ర నాయకులు ముదుగంటి రవీందర్‌రెడ్డి అన్నారు. జగిత్యాల పట్టణంలోని స్థానిక దేవిశ్రీ గార్డెన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ ఆవిర్భావం నుంచి అనేక మంది కార్యకర్తలు ఎన్నో త్యాగాలు చేశారని గుర్తు చేశారు. తాము మున్సిపాలిటీలో జరిగిన అవినీతిపై చేసిన



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

పోరాటం చేస్తేనే శ్రావణి చైర్‌పర్సన్‌కు రాజీనామా చేశారన్నారు. అవినీతి ఆరోపణలు ఎదురుకున్న శ్రావణిని పార్టీలో చేర్చుకున్న, పార్టీ నిర్ణయం మేరకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. పార్టీ కోసం ఇన్నేళ్లుగా పని చేసిన కార్యకర్తలను గౌరవించకుండా, తమను సంప్రదించకుండా మరోకరికి టికెట్ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఇందులో ఏదో దురుద్దేశ్యం, కుట్ర దాగి ఉందని అనుమానం వ్యక్తం చేశారు. ఈ సారి కూడా టికెట్ వస్తుందని ఆశించినా. కానీ నాయకులు, కార్యకర్తల మనో భావాలకు భిన్నంగా వేరే పార్టీ నుంచి వచ్చిన శ్రావణికి టికెట్ ఇచ్చారని, టికెట్ వచ్చి మూడు రోజులైన శ్రావణి గానీ, వాళ్ళ కుటుంబం గానీ తనను సంప్రదించలేదన్నారు. ఇక్కడ కేటాయించిన టికెట్ బీజేపీ గెలవడం కోసం కాదు అని, ఓ నాయకున్ని గెలిపించడం కోసం అని పార్టీ అధిష్టానం ఆలోచిం చాలన్నారు. మోసపూరిత కుట్రను త్వరలోనే బహిర్గతం చేస్తామని, కార్యకర్తలు బిజెపి అభ్యర్థికి గాని, బీఆర్ఎస్, కాంగ్రెస్ ఇతర పార్టీలకు ఓటు వేయమని భావిస్తే స్వతంత్రంగా అయిన పోటీ చేసేందుకు సిద్ధం అవుతానని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపెల్లి రవీందర్, లింగంపేట శ్రీనివాస్, కౌన్సిలర్ గుర్రం రాము, భాగవంతు రావు, సుధాకర్, చంద్రశేఖర్‌రావు , విద్యా ఠాకూర్, కిషోర్ సింగ్, నారాయణరెడ్డి, మల్లేశం, బడే శంకర్, ప్రమోద్, విజయ్, ప్రభాకర్, అధిక సంఖ్యలో కార్యకర్తలు



ధరణితోనే సమస్యలు

- కాంగ్రెస్ జగిత్యాల అభ్యర్థి జీవన్‌రెడ్డి

నవతెలంగాణ-జగిత్యాల

ధరణి పోర్టల్ వల్లనే సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని ధరణి సమస్యలు లేని గ్రామం అంటూ లేదని పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో విలేకర్లతో జీవన్‌రెడ్డి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతుల సమస్యల పట్ల ప్రభుత్వ ప్రతినిధులుగా వీఆర్ఓ, వీఆర్ఏలు ఉండేవారని,ఆ వ్యవస్థను కేసీఆర్ ఎందుకు రద్దు చేశారో అర్థం అవ్వడం లేదని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పటేల్, పట్వారీ వ్యవస్థ వస్తుందని హరీశ్‌రావు అనడం హాస్యాస్పదం అన్నారు. పటేల్, పట్వారీ వ్యవస్థ ఎప్పుడు రద్దు అయిందో హరీశ్‌రావుకు తెలుసా అని ప్రశ్నించారు. కేసీఆర్ ఎమ్మెల్యే కాకముందు ఎన్‌టీ రామారావు పటేల్, పట్వారీ వ్యవస్థ రద్దు చేశారని గుర్తు చేశారు. కేసీఆర్ వీఆర్ ఓ, వీఆర్ఏ వ్యవస్థను రద్దు చేయడంతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ వ్యవస్థ లేకుండా పోయిందని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు నివేదికలు ఇచ్చే వారు కరువయ్యారని పేర్కొన్నారు. వీఆర్ఓ, వీఆర్ఏ వ్యవస్థను ఎందుకు రద్దు చేశారో సీఎం కేసీఆర్‌కే తెలియదని ఎద్దేవా చేశారు. వీఆర్ఓ, వీఆర్ఓల వద్ద మాత్రమే అవినీతి ఉందా? ప్రభుత్వం పారదర్శకంగా నడుస్తుందా స్వచ్ఛమైన పాలన సాగుతుందా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో లక్షలాది ధరణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, ఏ భూమి ఎవరి పేరు మీద ఉందో తెలియడం లేదు అన్నారు. కబ్జాలో ఉండి సాగు చేసుకుంటున్న వారి పేరు లేదు. రిజిస్ట్రేషన్ పూర్తి కాగానే పట్టా వస్తుందని అంటున్నారు. హస్నాబాద్ వద్ద భూమి కొనుగోలు చేసిన ఎమ్మెల్సీ కవితకే పట్టాదారు పాసుపుస్తకం జారీ కాలేదని, ధరణి పనితీరుకు ఇది నిదర్శనమన్నారు. తెలంగాణ రాష్ట్రం సాధించుకుంది ఉద్యోగాలు సృష్టించుకునేందుకా కొలువులకు కోత పెట్టేందుకా అని ప్రశ్నించారు. వీఆర్ఓ, వీఆర్ఏ వ్యవస్థలను రద్దు చేసి, ఇతర శాఖల్లో భర్తీ చేయడంతో 30వేల ఉద్యోగాలను నిరుద్యోగ యువత కోల్పుతున్నారని తెలిపారు. రెవెన్యూ సమస్యలు పరిష్కరించేందుకు నాలుగు నెలల్లో ధరణి అవకతవకలు సరిచేస్తామని, ధరణి సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ ట్రిబ్యునల్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ధరణిలో లోపాలను సవరిం చేందుకు నాలుగు నెలల్లో ప్రతి జిల్లాలో రెవెన్యూ ట్రిబ్యునల్ ఏర్పాటు చేస్తామని,30వేల ఉద్యోగాలను నిరు ద్యోగ యువతకు తిరిగి పోస్టులు భర్తీ చేస్తామని చెప్పారు.



జెండా ఊపి ఫ్లాగ్ మార్చ్ ప్రారంభిస్తున్న ఎస్పీ

ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా సహకరించాలి

- జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్

నవతెలంగాణ-జగిత్యాల

అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో 300 మంది జిల్లా పోలీస్, కేంద్ర బలగాలతో కలసి ఫ్లాగ్ మార్చ్‌ను ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. ఓల్డ్ బస్టాండ్, తహసీల్ చౌరస్తా, టవర్ సర్కిల్, తీన్ ఖని, కిలగడ్డ ,గంజ్ రోడ్డ్ ప్రాంతాలలో ఫ్లాగ్ మార్చ్ సాగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజల్లో భద్రత భావాన్ని పెంపొందించడానికి ఫ్లాగ్ మార్చ్ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు చెప్పారు. ఎన్నికల కమిషన్ సూచించిన మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో స్వేచ్ఛాయుతంగా జరిగేలా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ప్రభాకరరావు, భీం రావ్, అసిస్టెంట్ కమాండెంట్లు దివకార్, సునీల్‌కుమార్, డీఎస్పీలు రవీంద్రకుమార్, వెంకటస్వామి, రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

c m y k

పార్టీతో పాటు..సొంతంగా సేవలు అందించా

బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్

నవతెలంగాణ-మంథని


పార్టీలోకి ఆహ్వానిస్తున్న పుట్ట మధు

తొమ్మిదేండ్ల కాలంలో బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వంతోపాటు తాను సొంతంగా ప్రజలకు ఎంతో చేసినా తననే ప్రశ్నిస్తున్నారే కానీ ఏమీ పని చేయనోళ్లను ఇలా ప్రశ్నించిఉంటే ఎప్పుడో బాగుపడే వాళ్లమని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్ అన్నారు.మంథని పట్టణంలోని రాజగృహలో మంథని నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరగా వారి పుట్ట మధూకర్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక ఏండ్లు ఒకే కుటుంబానికి ఓట్లు వేసి గెలిపిస్తే అనేక పదవులు పొంది ఈ ప్రాంతానికి,ప్రజలకు ఏమీ చేయలేదని, నాటి నుంచి నేటి వరకు ఏమీ చేయకుండా మళ్లీ ఎన్నికలు వస్తున్నాయని ఓట్ల కోసం వస్తున్నారని అన్నారు.అలాంటి వారి గురించి ఆలోచన చేయాలని, తాము ఇంత చేసినా పెద్ద మనుషులు సైతం అర్థం చేసుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

కాళేశ్వరం ప్రాజెక్టును నిరుపయోగంగా మార్చారు

నవతెలంగాణ-మంథని


మాట్లాడుతున్న న్యూ ఇండియా పార్టీ నాయకులు

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం నిరుపయోగంగా మార్చారని బీఆర్ఎస్ ప్రభుత్వం పైన న్యూ ఇండియా పార్టీ ఉపాధ్యక్షుడు జనగామ లక్ష్మీనారాయణ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. బుధవారం మంథని పట్టణంలో ప్రెస్‌క్లబ్‌లో విలేఖరులతో ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మేడిగడ్డ అన్నారం సుందిళ్ల ప్రాజెక్టులు బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించడం జరిగిందని, ఇట్టి నిర్మాణం పూర్తిగా నిరుపయో గంగా మారిందని,ప్రాజెక్టులు నిల్వలేకపోవడం చాలా బాధాకరమైన విషయమని అన్నారు.ఈ కార్యక్ర మంలో ఉపాధ్యక్షుడు వేముల అశోక్,మంథని ఇన్‌చార్జ్ పద్మ, తదితరులు పాల్గొన్నారు.

గెలిపిస్తే అభివృద్ధి చేస్తా : మాజీ మావో చంద్రన్న

నవతెలంగాణ-మంథని:


మాట్లాడుతున్న చంద్రన్న

ఒక్క ఓటు వేయండి అభివృద్ధికరమైన పాలన మేము అందిస్తా మని,మంథని ఎమ్మెల్యే అభ్యర్థిగా మాజీ మావో బందారపు మల్లయ్య, అలియాస్ చంద్రన్న దళిత లిబరేషన్ ఫ్రంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్వాడి సుదర్శన్‌తో కలిసి ప్రజలను కోరారు. బుధవారం మంథని పట్టణం ప్రెస్‌క్లబ్‌లో మాజీ మావోలు పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత పాలకుల వల్ల ఈ ప్రాంత ప్రజలు విసుగు చెందారని,ప్రజా సంక్షేమ ప్రభుత్వం రావాలంటే చంద్రన్నను గెలిపించుకోవాలని సుదర్శన్ కోరారు. మంథని ఎమ్మెల్యే అభ్యర్థి చంద్రన్న మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా ప్రజల కోసం అడవిలో పోరాటం చేసిన,ఇప్పుడు ప్రజాక్షేత్రంలో ప్రజల కోసం సేవ చేసేందుకు ముందుకు వస్తున్నానని, ప్రజలంతా ఆలోచన చేసి ఆశీర్వదించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో ఎరుకల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రేవెల్లి శంకర్,సామాజిక ఉద్యమకర్త పోరెడ్డి వెంకటరెడ్డి,నేషనల్ కాంగ్రెస్ పార్టీ రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుర్ర శివ పాల్గొన్నారు.

మంథని గౌడ సంఘం అధ్యక్షుడిగా మాచీడి సత్యనారాయణగౌడ్

నవతెలంగాణ-మంథని:


నూతనంగా ఎన్నికైన గౌడ సంఘం అధ్యక్ష,కార్యదర్శులు

మంథని గౌడ సంఘం అధ్యక్షుడిగా మాచీడి సత్యనారాయణగౌడ్ ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు.స్థానిక శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయ ఆవరణలో గౌడ సంఘం నాయకులు బుధవారం సమావేశం నిర్వహించుకొని గౌడ సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మాచీడి సత్యనారాయణగౌడ్, ఉపాధ్యక్షుడిగా ఆరెల్లి మల్లయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శిగా తాటి బాలయ్య గౌడ్, కోశాధికారిగా పొన్నం మోహన్‌గౌడ్,కార్యవర్గ సభ్యులుగా మాచీడి సత్యనారాయణగౌడ్, భీముని గోపాల్ గౌడ్, కమ్మగోని శంకర్‌గౌడ్, తాటి వెంకటేష్‌గౌడ్, మాచీడి లింగయ్యగౌడ్‌లను ఎన్నుకున్నారు.

ఆ ఇద్దరి చేరికతో దాసరికి లాభం లేదు.. నష్టం లేదు

బీఆర్ఎస్‌లో చేరిన పెద్దపల్లి మాజీ ఎంపీపీలు సత్యనారాయణ రెడ్డి వేముల రామ్మూర్తి

కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన ఘంటారాములు ఎటువైపు

నవ తెలంగాణ -పెద్దపల్లి

పెద్దపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీలు సి సత్యనారాయణ రెడ్డి, వేముల రామ్మూర్తి బుధవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో హైదరాబాద్ ప్రగతి భవన్‌లో బీఆర్ఎస్‌లో చేరారు. వారి చేరిక వల్ల పెద్దపల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డికి ఎటువంటి ఉపయోగం గాని నష్టముగాని లేదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇటీవల వారితోపాటు ఓదెల జడ్పీటీసీ కాంగ్రెస్ నాయకులు గంటా రాములు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. ఆయన ఏ పార్టీలోకి వెళ్తారనే విషయంపై స్పష్టత లేదు.

ఆ ఇద్దరు బీఆర్ఎస్‌లో చేరడం వల్ల దాసరికి ఎటువంటి లాభం?

పెద్దపల్లి మాజీ ఎంపీపీ బీఆర్ఎస్ వ్యవస్థాపకుల్లో ఒకరు..ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ అధ్యక్షుడు కాంగ్రెస్ సీనియర్ నాయకులు చింతలపల్లి సత్యనారాయణ రెడ్డి ఒకరు. పెద్దపల్లి మాజీ ఎంపీపీ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పద్మశాలి సంఘం నాయకులు వేముల రామ్మూర్తి ఒకరు. వీరిద్దరూ గత కొంతకాలంగా కాంగ్రెస్‌లో పనిచేస్తూ వస్తున్నారు. ఎన్నికల్లో పెద్దపల్లి నియోజకవర్గంలో ఈసారి కాంగ్రెస్‌లో బీసీ నాయకులకు అవకాశం ఇవ్వాలని గత కొంతకాలంగా అధిష్టానం వద్ద ఒత్తిడి చేస్తూ వస్తున్నారు. అదేవిధంగా అన్ని రాజకీయ పార్టీలో కూడా పెద్దపల్లి నియోజకవర్గంలో ఈ ఎన్నికల్లో బీసీలకు అవకాశం కల్పించాలని అంశంపై కాంగ్రెస్‌తో పాటు బీజేపీ, బీఆర్ఎస్‌లో నాయకులతో కూడా చర్చిస్తూ వస్తున్నారు. అయినప్పటికీ కూడా బీఆర్ఎస్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డినే సీఎం కేసిఆర్ ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావునే కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించారు. అదే మాదిరిగా బీజేపీలో కూడా ఇంకా అభ్యర్థిని ప్రకటించనప్పటికీ రెడ్డి,రావులకు సంబంధించిన నాయకులే ప్రధానంగా పోటీపడుతున్నారు. పార్టీలో తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని మాజీ ఎంపీపీలు చింతలపల్లి సత్యనారాయణ రెడ్డి, వేముల రామ్మూర్తి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. అయితే వారు బీఆర్ఎస్‌లో చేరిక వల్ల పెద్దపల్లి నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డికి ఎటువంటి లాభంగాని నష్టముగాని ఉండదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. 2003 జడ్పీటీసీ ఎన్నికల్లో కాల్వ శ్రీరాంపూర్ జడ్పీటీసీగా పోటీ చేసిన చింతలపల్లి అప్పటి టీడీపీ అభ్యర్థి సారయ్య గౌడ్ మీద ఓడిపోయారు. 2004 ఎన్నికల్లో అప్పటి మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ సీనియర్ నేత గిట్ల ముకుంద రెడ్డి బీఆర్ఎస్‌లో చేర్చుకొని ఆయనకు బీఆర్ఎస్ టికెట్ ఇచ్చారు. ఆయన గెలవడంతో అప్పటినుంచి చింతలపల్లి సత్యనారాయణ రెడ్డి బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శిగా కొంతకాలం కొనసాగి తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. అదే మాదిరిగా కాంగ్రెస్ తరపున పెద్దపల్లి ఎంపీపీగా పనిచేసిన వేముల రామ్మూర్తి కూడా తర్వాత బీఆర్ఎస్‌లో చేరి తెలంగాణ ఉద్యమంలో పనిచేసినప్పటికీ ఆయనకు గుర్తింపు లేకపోవడంతో మళ్లీ కాంగ్రెస్‌లో చేరి ఇంతకాలం పని చేస్తూ వస్తున్నారు. అయితే వీరిద్దరికీ కాంగ్రెస్‌లో పార్టీలో ఎటువంటి గుర్తింపు లేకపోవడం ప్రజల్లో ఎటువంటి ప్రభావం లేకపోవడం వల్ల వారిని ఏ పార్టీ కూడా పెద్దగా ప్రాధాన్యత ఇవ్వడం లేదు. ప్రస్తుతం తిరిగి బీఆర్ఎస్‌లోకి వెళ్లినప్పటికీ ఈ ఎన్నికల సమ యంలోబీఆర్ఎస్ అభ్యర్థి సిట్టింగ్ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డికి గాని ఓట్ల పరంగా గాని ఎటు వంటి లాభం లేదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేటీఆర్

గంటా రాములు ఎటువైపు ?

కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఓదెల జడ్పీటీసీ గంటా రాములు ఇటీవల కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. అయితే ఏ పార్టీకి వెళ్తారని విషయంపై ఇంకా స్పష్టత ఇవ్వడం లేదు. గంటా రాములు ఇప్పటికే రెండుసార్లు టీడీపీ తరఫున జడ్పీటీసీగా పనిచేశారు. ఒకసారి కాంగ్రెస్ నుండి ఓదెల జడ్పీటీసీగా పని చేశారు. అయితే ఈ ఎన్నికల్లో బీసీలకు అవకాశం ఇస్తే కాంగ్రెస్ నుంచి పెద్దపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలని ఆశ భావంతో కొంతకాలంగా ప్రయత్నం చేశారు. కాంగ్రెస్ అధిష్టానం మరోసారి విజయరమణా రావుని కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించారు.దీంతో అసంతృప్తికి గురైన ఘంటారాములు ఆ పార్టీకి రాజీనామా చేశారు. అయితే ఆయన ఏ పార్టీలోకి వెళ్తారని అనే విషయంపై ఇంకా ప్రకటించలేదు. ప్రస్తుతం బీజేపీ అవకాశం ఇస్తే పోటీ చేయాలని ఆలోచనతో రహస్యంగా బీజేపీ నాయకులతో చర్చిస్తున్నట్లుగా తెలుస్తుంది. అదేవిధంగా బీఆర్ఎస్‌లో ఏదైనా రాష్ట్రస్థాయిలో కార్పొరేషన్ పదవులు ఇవ్వడంపై అధిష్టానం హామీ ఇస్తే, బీఆర్ఎస్‌లో చేరే అనే విషయంపై కూడా ఆలోచిస్తున్నట్లుగా తెలుస్తుంది.

కాంగ్రెస్‌లో పలువురి చేరికలు

నవతెలంగాణ -సుల్తానాబాద్ రూరల్


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే విజయ రమణారావు

శాసనసభ ఎన్నికల సమయం దగ్గర పడుతున్న వేళ పెద్దపల్లి నియోజకవర్గంలో ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. పది సంవత్సరాలుగా బీఆర్ఎస్ పార్టీలో సేవలందించిన ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయ రమణారావు గెలుపే లక్ష్యంగా పార్టీలో చేరుతున్నారు. బుధవారం మండలంలోని శివపల్లిలో మాజీ ఎమ్మెల్యే విజయ రమణారావు నివాసంలో ఎలిగేడు మండలం, సుల్తానాబాద్ మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఎలిగేడు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బూర్ల సింధు రాజు, పలువురు యువకులు, మహిళలు పెద్దపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే విజయ రమణారావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలోమాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు, జడ్పీటీసీ వినుపాల స్వరూప రాణి ప్రకాష్ రావు, మండల అధ్యక్షుడు చిలుక సతీష్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్ రావు, కాంగ్రెస్ పార్టీ మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడు పన్నాల రాములు పాల్గొన్నారు.

దుబాయ్‌లో వర్షిణి నృత్యానికి ప్రశంసల వెల్లువ

నవతెలంగాణ-గోదావరిఖని టౌన్:


సన్మానిస్తున్న రెయిన్‌బో కరస్పాండెంట్ అమరేందర్

దుబాయ్‌లో జరిగిన బతుకమ్మ ఉత్సవాలలో పాల్గొని స్వదేశానికి వచ్చిన వర్షిణిని రెయిన్‌బో స్కూల్ కరస్పాండెంట్ పి.ఎస్.అమరేందర్, డ్యాన్స్ మాస్టర్ సర్వేష్‌ప్రశంసించారు. దుబాయ్‌లోని స్పార్క్ మీడియా ఆధ్వర్యంలో తెలంగాణ బతుకమ్మ సంబరాలు తెలుగు వారు అందరూ ఘనంగా నిర్వహించారు. ఉత్సవా లకు కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా మన దేశం నుంచి గోదావరిఖని యువతి వర్మని వర్షిణి పాల్గొ న్నారు. వారితో వర్షిణి బతకమ్మ ఆడి పాడి ఆటపాట లతో వాళ్లందరిని అలరించి అందరి ప్రశంసలు అందుకున్నారు. స్పార్క్ మీడియా నిర్వాహకులు వర్షిణిని ఘనంగా సన్మానించారు.

కపట ప్రేమను ప్రదర్శిస్తున్న కాంగ్రెస్

ఆర్జీ-3 ఏపీఏ టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ గౌతమ్ శంకరయ్య

నవతెలంగాణ-రామగిరి


గౌతమ్ శంకరయ్య

సెంటినరీ కాలనీ రుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో ప్రతి సంవత్సరం పుట్ట మధూకర్ పర్యవేక్షణలో జరిగే రాంలీలా కార్యక్ర మాన్ని ఎన్నికల కోడ్ నెపంతో జరగకుండా నిలిపివేయాలని కపట బుద్ధితో ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నాయకుల కు ప్రజలు ప్రజాక్షేత్రంలో తగిన బుద్ధి చెప్పాలని సింగరేణి గుర్తింపు సంఘం ఆర్జీ-3 ఏపీఏ ఏరియా ఉపాధ్యక్షుడు గౌతమ్ శంకరయ్య అన్నారు. కార్మికుల ఆనందాన్ని ఓర్వలేని కాంగ్రెస్ పార్టీ నాయకులు చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఫిర్యాదు చేయడం వారియొక్క దిగజారుడు తనానికి నిదర్శనం అని ఆయన అన్నారు.

పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీగా సొప్పదండి దుర్గా ప్రసాద్

నవతెలంగాణ-యైటింక్లయిన్ కాలనీ:


నియామక పత్రం అందుకుంటున్న దుర్గాప్రసాద్

పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీగా సొప్ప దండి దుర్గాప్రసాద్‌ని నియ మించి నట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకత్వం బుధ వారం వెల్లడించింది. దీనికి సంబంధించి జిల్లా అధ్యక్షుడు మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్ నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లా డుతూ తన నియామకానికి సహకరించిన మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబుకి,మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్‌కి కృతజ్ఞతలు తెలిపారు.కాంగ్రెస్ పార్టీ గెలుపుకై శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.

c m y k

తీగల వంతెన పనులపై సమగ్ర విచారణ జరిపించాలి

సీపీఐ(ఎం) నగర కార్యదర్శి గుడికందుల సత్యం



నవతెలంగాణ - కరీంనగర్

ఆగమేఘాల మీద కరీంనగర్‌లో నిర్మించిన తీగల వంతెన నాణ్యతా లోపాలపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) నగర కార్యదర్శి గుడికందుల సత్యం అన్నారు. అధికారుల పర్యవేక్షణ లోపించిందని, కాంట్రాక్టర్లు ప్రజా ప్రతినిధులు వాటాలు పంచుకొని నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం మూలంగానే పలుమార్లు తీగల వంతెన పాడైపోతుందని అన్నారు. తీగల వంతెన పనులపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం ఉంటే బ్లాక్ లిస్టులో పెట్టి సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు.

ఆశీర్వదించండి.. మరింత అభివృద్ధి చేస్తా

ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

నవతెలంగాణ - గన్నేరువరం

జంగపల్లి గ్రామంలో ప్రజాఆశీర్వాద సభను బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంప వెంకన్న అధ్వర్యంలో నిర్వహించారు. గ్రామాన్ని రూ.85లక్షల నిధులతో ఎమ్మెల్యే అభివృద్ధి చేశారని సర్పంచ్ అటికం శారద అన్నారు. జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్‌ను ఆధరించాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ఉద్యకారుడిని మళ్లీ ఆశీర్వదించండి.. మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు. అభివృద్ధి చేసినం ఓట్లు అడుగుతున్నామని అన్నారు. 50ఏండ్లు పాలన చేసిన కాంగ్రెస్ నాయకులు ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని ప్రజలు అడగాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ జువ్వాడి మన్‌మోహన్‌రావు, ఎంపీటీసీ గుడెల్లి ఆంజనేయులు, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు తీగల మోహన్‌రెడ్డి, నాయకులు హన్మండ్ల శ్రీనివాస్, కుసుంభ నవీన, ఉపసర్పంచ్ జీకురు లత, తాడూరి వెంకట రమణరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థికి ఘన సన్మానం..



విద్యార్థిని సన్మానిస్తున్న జాడి బాల్‌రెడ్డి

నవతెలంగాణ - కరీంనగర్

వరల్డ్ కరాటే యూనియన్ ఆధ్వర్యంలో కెనడా దేశంలోని గాలిగరిలో నిర్వహించిన అంతర్జాతీయ చాంపియన్ షిప్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ పద్మరావు నగర్ కాలనీకి చెందిన గాంధీ ఆస్పత్రిలో యూరాలజిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ సతీష్ కుమార్ కుమారుడు ఎనిమిదో తరగతి చదువుతున్న శ్రీవత్సవ శరత్‌స్మిత్ మూడో బహుమతి కాంస్య పతకం సాధించాడు. ఆ విద్యార్థిని కరీంనగర్‌లోని 18వ డివిజన్ రేకుర్తిలో జన చైతన్య సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు జాడి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జాడి బాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇలాంటి టోర్నమెంట్‌లో పాల్గొని వారి నైపుణ్యతను చాటి చెప్పాలన్నారు. పట్టుదలతో పోటీలలో పాల్గొని విజయాలు సాధించాలని అన్నారు. కార్యక్రమంలో గోల కిష్టయ్య, గోల శంకర్, రేడియో రాములు, దుర్గం ఆంజనేయులు, ఎం.లక్ష్మిరాజం, జాడి భూమయ్య, రావుల భాస్కరాచారి, నాయకులు పెసర స్వామి, కౌసల్య కామెర, అనిత, గోలే అంజలి, జాడి శివ సాయి చరణ్, లలిత, ఆదిత్య, అరవింద్ గోలే, అజయ్ వర్మ, దుర్గం భూమయ్య పాల్గొన్నారు.

నామినేషన్ల ప్రక్రియకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

కరీంనగర్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ బి.గోపి



అసెంబ్లీ నియోజకవర్గ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి

నవతెలంగాణ - కరీంనగర్ / చొప్పదండి

త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా నామినేషన్ల ప్రక్రియకు ఏర్పాట్లు పూర్తిచేయాలని కరీంనగర్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ బి.గోపి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం చొప్పదండి, కరీంనగర్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలలో చేపట్టిన ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ బి.గోపి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నామినేషన్ ప్రక్రియకు ఏర్పాట్లను పూర్తిచేసి, నామినేషన్ స్వీకరించే రోజు నుండి ప్రక్రియ ముగిసే వరకు ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు 100 మీటర్ల వరకు దారిని, దుకాణాలు మూసివేయాలని చెప్పారు. ఎన్నికల నిబంధన మేరకు మాత్రమే నామినేషన్ వేసే వారితోపాటు మరో నలుగురిని అనుమతించాలని సూచించారు. నామినేషన్ ప్రక్రియ మొత్తాన్ని వీడియోగ్రాఫీ చేయించాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లో ఎన్నికల నిబంధన మేరకు ఉదయం 11గంటల కంటే ముందు మధ్యాహ్నం మూడు గంటల తర్వాత నామినేషన్‌ను స్వీకరించొద్దన్నారు. నామినేషన్ల స్క్రూటీని ఎక్కడ ఎప్పుడు నిర్వహిస్తారనే సమాచారాన్ని అభ్యర్థులకు తెలియజేయాలని, అందుకు కావాల్సిన ఏర్పాట్లను వెంటనే పూర్తి చేసుకోవాలన్నారు. కార్యాలయంలో వెంటనే వ్యయ పరిశీలన, సీ-విజిల్ కంట్రోల్ రూమ్‌లు, బ్యానర్లను ఏర్పాటు చేయాలన్నారు. కార్యాలయ ఆవరణ, కార్యాలయంలో రూములను పరిశీలించి, ఎన్నికల నిబంధనల ప్రకారం అన్ని ఏర్పాట్లు చేసుకొని సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో చొప్పదండి రిటర్నింగ్ అధికారి (ఏసీఎల్బీ) ప్రఫుల్ దేశాయ్, కరీంనగర్ రిటర్నింగ్ అధికారి కె.మహేశ్వర్, ఏసీపీ నరేందర్, కరీంనగర్, చొప్పదండి తహసీల్దార్లు రమేష్, నవీన్, నరేందర్, సీఐ రవీందర్, చొప్పదండి మున్సిపల్ కమిషనర్ శాంతి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీలను నమ్మితే నట్టేట ముంచుతారు

చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

నవతెలంగాణ - గంగాధర

కాంగ్రెస్, బీజేపీలను నమ్మితే నట్టేట మునగడం ఖాయమని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి కేసీఆర్ పాలనే శ్రీరామ రక్షని, ఈ ఎన్నికల్లో రాష్ట్రాన్ని, సీఎం కేసీఆర్‌ను ప్రజలు కాపాడుకు ంటారని అన్నారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను మోడీ ఎలా అమ్మేస్తున్నారో, ప్రయివేటు పరం చేస్తున్నారో ప్రజలే గ్రహిస్తున్నారని అన్నారు. మేడిగడ్డ బ్యారేజ్ ఘటన వెనక కుట్రకోణం దాగి ఉందని, భారీ వరదలకు తట్టుకున్న పిల్లర్లు ఎన్నికలకు ముందే కుంగడం వెనుక అనుమానాలు ఎన్నో ఉన్నాయన్నారు. సమావేశంలో ఎంపీపీ శ్రీరాం మధూకర్, ఏఎంసీ చైర్మన్ లోకిని ఎల్లయ్య, సింగిల్‌విండో చైర్మన్లు వెలిచాల తిరుమలరావు, దూలం బాలాగౌడ్, కొండగట్టు ఆలయ ధర్మకర్తలు పుల్కం నర్సయ్య, ఉప్పుల గంగాధ ర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మేచినేని నవీన్ రావు, సర్పంచులు వేముల దామోదర్, మడ్లపల్లి గంగాధర్, ఆకుల శంకరయ్య, కంకణాల విజేందర్‌రెడ్డి, ఎంపీటీసీలు అట్ల రాజిరెడ్డి, మాజీ ఎంపీపీ పడితపల్లి కిషన్, ఏఎంసీ ఉపాధ్యక్షుడు సామంతుల శ్రీనివాస్, నాయకులు ఆకుల మధుసూదన్, అట్ల శేఖర్‌రెడ్డి, మహేశుని ఈశ్వరయ్య, వేముల అంజి, భాస్కర్ పాల్గొన్నారు.

వాగేశ్వరి కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్



నవతెలంగాణ - తిమ్మాపూర్

మండలంలో రామకృష్ణ కాలనీలోని వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న తాళ్లపల్లి రవికుమార్‌కు 'డీప్ సెంటిమెంట్ అనాలసిస్ మెథడ్స్ యూజింగ్ మిషన్ లెర్నింగ్ ఫర్ ఎక్స్రాక్షన్ ఆఫ్ బ్రాండ్ వాల్యూ ఫర్ వేరియేషన్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్' అనే అంశంపై చేసిన పరిశోధనకు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కళాశాల జనరల్ సెక్రెటరీ డాక్టర్ గంద్ర శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ జి.నరసింహ పర్యవేక్షణలో ఈ పరిశోధన చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా రవికుమార్‌ను కళాశాల జాయింట్ సెక్రెటరీ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు వినోద్, ప్రకాష్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ చంద్రమౌళి, అధ్యాపకులు అభినందించారు.

లబ్దిదారుల లిస్టు లీకేజీ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆర్డీఓకు వినతి



ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నవతెలంగాణ - కరీంనగర్

మైనారిటీ కార్పొరేషన్ ద్వారా ఇచ్చిన ముస్లిం రుణాలు మొదటి లిస్టులో మొత్తం బీఆర్ఎస్, ఎంఐఎం నాయకులకు వారి అనుచరులకు మాత్రమే లోన్లు ఇచ్చారని, రెండో విడత లిస్టులో కూడా వారి పేర్లే ఉన్నాయని దరఖాస్తు చేసుకున్న ఆర్జీ దారులకు ఎవరికీ కూడా ఇవ్వలేదని బుధవారం కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ మైనారిటీ సెల్ ఆధ్వర్యంలో కరీంనగర్ ఆర్డీవో, కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. ఈ మేరు లేఖను ఆర్డీఓ కార్యాలయంలో నేరుగా ఆర్డీవో మహేష్‌కి అందజేశారు. ప్రస్తుతం ఎలెక్షన్ కోడ్ అమలులో ఉన్నందున ముస్లిం బంధు లిస్ట్ ఎలా బహిర్గతమైందని సంబంధిత అధికారులను ప్రశ్నిస్తూ, ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందున లోను మంజూరైన వారికి చెక్కులు ఇవ్వడం తగదని, కేవలం ముస్లిం ఓట్లు దండుకోవాలనే ఉద్దేశంతోనే ఈ లిస్ట్ బయట పెట్టి ముస్లిం సమాజాన్ని ముస్లిం ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తున్నారని ఆర్డీఓకి ఇచ్చిన ఫిర్యాదులో తెలిపారు. ఎలక్షన్ కోడ్ ఉన్నందున లబ్దిదారుల లిస్ట్ బయటకు తీసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ.తాజ్, నగర కాంగ్రెస్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ అఖిల్, కాంగ్రెస్ నాయకులు ఎండీ నిహాల్, ఎండీ లాయిక్, ఎండీ కలీం, ఫిరోజ్, అబ్దుల్ కరీం పాల్గొన్నారు.

సురభి పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

నవతెలంగాణ - గంగాధర

గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలోని సురభి కాన్వెంట్ హై స్కూల్‌లో 2007-08 సంవత్సరంలో విద్యాభ్యాసం చేసిన పూర్వవిద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. బోధించిన గురువులకు ఘనంగా సన్మానం చేశారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో 84 మంది పాల్గొనగా, పాఠశాల కరస్పాండెంట్ చిప్ప వీరేశం, ప్రధానోపాధ్యాయుడు చిప్ప వీరనర్సయ్య, ఉపాధ్యాయులు దామోదర్, నాగరాజు, శ్రీనివాస్, ప్రేమ్ సాగర్, మల్లేశం, రాజేశం, రమేష్, గోపాల్ రెడ్డి, ఆనందం, ఆంజనేయులు పాల్గొన్నారు.